ఏప్రిల్ - 2026

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | కె.ఇ. రాజేంద్ర | 02 |
| జప్పత్పనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 05 |
| భయము విడిచి... | కె.ఇ. రాజేంద్ర | 07 |
| మీరు బైబిలంతా... | హన్నాకృప డెస్క్ | 08 |
| సృష్టికర్త | హన్నాకృప డెస్క్ | 09 |
| నూతన సృష్టి | సాక్ష్యము | 10 |
| తెలివిలేదు, యోచింపరు | హన్నాకృప డెస్క్ | 12 |
| బైబిల్ ప్రాముఖ్యత | హన్నాకృప డెస్క్ | 13 |
| మదర్ తెరీసా | వై. ప్రసాద్‌రావు | 15 |
| తల్లిదండ్రులారా! | కె.ఇ. రాజేంద్ర | 17 |
| బహుమానము | డా॥ సుష్మ, నెల్లూరు | 19 |
| నా కుటుంబము | స్త్రీల కొరకు | 20 |
| అంతా నా మేలుకే | చిన్నపిల్లల పేజి | 22 |
| బైబిల్ పదవినోదం-16 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,



**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726



**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890



**HANNA KRUPA**

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 23 సంచిక : 04**


**ప్రభువగు యెహోవాయే నాకు బలము**

| సీరియల్ నంబరు | |
|---|---|

సంపాదకీయం....

# యుద్ధము యెహోవాదే

హన్నాకృప పాఠకులకు ప్రభువు నామమున వందనములు.

సైన్యంలో చేరిన వారికి తెలుసు యుద్ధానికి వెళ్తే మరణించే అవకాశం ఉంటుందని. అయినప్పటికీ బ్రతుకు తెరువు కోసమో, తప్పనిసరి పరిస్థితిలోనో చావుకి తెగించి సైన్యంలో చేరతారే తప్ప దేశం మీద ప్రేమతో కాదు. గిద్యోను మిద్యానీయుల మీదకు సైన్యంతో యుద్ధానికి వెళ్ళినప్పుడు దేవుడు గిద్యోనుతో, -భయపడే వారిని తిరిగి వెళ్ళమని చెప్పినప్పుడు 22,000 మంది వెళ్ళిపోతారు. ఈ భూమ్మీద మనిషి పుట్టిన దగ్గర్నుండి మరణించేటంత వరకు ఏదో ఒక విషయం మనిషిని భయపెడుతూనే ఉంటుంది. చాలామంది చావలేక బ్రతుకుతుంటారు. కుటుంబం సమస్యలు, ఉద్యోగ వ్యాపారాల్లో సమస్యలు, ఆరోగ్య సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులు ఇలా రకరకాలైన సమస్యలతో రోజూ యుద్ధం చేయాల్సి వస్తుంది. ఇలాంటి సమస్యల నుండి తప్పించుకోవడానికి మనుష్యులు చావుని ఆశ్రయిస్తుంటారు. మనుష్యులని గుడ్డిగా నమ్మి మోసపోతారు కానీ, సమస్యల నుండితప్పించే దేవున్ని నమ్మడానికి మనసు రాదు. *"లోకములో మీకుశ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి"* అని యోహాను 16:33లో యేసుప్రభువు చెప్పిన మాటలను మనుష్యులు పట్టించుకోవడం లేదు. ఈ లోకం మనుష్యులకు ధైర్యాన్ని ఇవ్వదు. ఎంత బలవంతులైనా, ఎంత ధనవంతు లైనా ధైర్యంగా బ్రతకలేరు. ఏదో తెలియని భయం వాళ్ళని వెంటాడుతూ ఉంటుంది. చనిపోతామేమో అని చాలా భయపడుతుంటారు. ప్రాణాలు కాపాడుకోడానికి అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ దేవున్ని నమ్మిన వాళ్ళకి ప్రాణభయం ఉండదు. కేవలం దేవుడు మాత్రమే మనుష్యులకు ధైర్యాన్ని ఇస్తాడు. దేవున్ని నమ్మిన వాళ్ళు వీరులుగా, శూరులుగా నడుచుకుంటారు. బైబిల్లో దావీదు జీవితం మనం చూస్తే, బాల్యము నుండి ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించినట్లు గమనించగలం. సింహాన్ని,ఎలుగు బంటిని, గొల్యాతుని ఎదుర్కొని చంపేటంత ధైర్య సాహసాలు దావీదు చూపించాడంటే అది కేవలం దేవుని వలననే సాధ్యమయ్యింది. దేవునియందు భయభక్తులు కలిగి ఉండటం వలన దావీదు ఎలాంటి సమస్యనైనా ఎంతో ధైర్యంగా ఎదుర్కోగలిగాడు. దావీదుకు కూడా తెలుసు తన బలమంతా దేవునిదే అని. అందుకే 'యుద్ధము యెహోవాదే' అన్నాడు. మనకి కూడా ఈ లోకంలో సింహం, ఎలుగుబంటి, గొల్యాతులాంటి బలమైన సమస్యలు ఎదురవుతుంటాయి. ఒక్కోసారి యుద్ధ వాతావరణం ఎదురవుతుంది. అయితే మనం దావీదులా దేవునియందు భయభక్తులతో ఉంటే, దేవుడే మన తరపున యుద్ధం చేసి మనకు విజయం చేకూరుస్తాడు. ఈ లోకమనే యుద్ధభూమిలో మనం ఉన్నప్పుడు దేవుడు మన వెన్నుతట్టి *"భయపడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడ వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు"* అని ద్వితీయో.31:6లో చెప్పిన విధంగా దేవుడు మనతో ఉంటాడు. దావీదులా దేవునియందు భయభక్తులు కలిగి నీ సమస్యలన్నిటిలో ఆయన మీద ఆధారపడటానికి నీవు సిద్ధమా? **-కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర, ఎడిటర్**

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**
**A/c No. 1095729434O**

సీరియల్



# జప్నత్పనేహు

**(యోసేపు జీవిత చరిత్ర)**

**- కొడవటికంటి**

వారు నేల మీద నుండి లేచిన తర్వాత "నేను దేవునికి భయపడువాడను. మీరు బ్రతుకునట్లు దీనిని చేయుడి. మీరు యథార్థవంతులు అయితిరా, మీ సహోదరులలో ఒకడు ఈ చెరసాలలో బంధింపబడవలెను. మీరు మీ కుటుంబముల కరువు తీరుటకు ధాన్యం తీసుకొని పోవుడి. మీ తమ్ముని నా యొద్దకు తీసుకొని రండి. అట్లు మీ మాటలు సత్యమైనట్టు కనబడును. కనుక మీరు చావరు" అని చెప్పి, వారు ఉన్న చెరసాల అధిపతి యొక్క గదిలోకి వెళ్ళి అక్కడ కూర్చున్నాడు.

జెబూలూను గొంతు కొంచెం పెద్దగా వినబడుతుంది. "నిశ్చయముగా మన సహోదరుని యెడల మనం చేసిన అపరాధమునకు శిక్ష పొందుచున్నాము. అతడు మనలను బతిమాలుకొనినప్పుడు మనము అతని వేదన చూచియు, వినకపోతిమి" అన్నాడు. ఆషేరు అందుకొని "అందుకనే ఈ వేదన మనకు వచ్చింది" అన్నాడు. రూబేనన్న గొంతు ఇప్పుడు వణికినట్లుగా ఉంది. "ఈ చిన్నవాని యెడల పాపము చేయకుడని నేను మీతో చెప్పలేదా? అయినను మీరు వినరైతిరి. గనుక అతని రక్తాపరాధము మన మీద మోపబడుచున్నది." రూబేనన్న స్వరం వినగానే జప్నత్ప హృదయం తల్లడిల్లింది. వెంటనే వెళ్ళి రూబేనన్నని కౌగిలించుకొని పెద్దగా ఏడ్వాలని అనుకున్నాడు. అక్షాపు ఇదంతా గమనించి మౌనంగా ఉన్నాడు. ఉన్నట్టుండి జప్నత్ప వేగంగా లేచి లోపల గదిలోకి వెళ్ళి తలుపు గడియ పెట్టుకున్నాడు. కొంచెంసేపటి తర్వాత బయటకు వచ్చి అక్షాపుని పిలిచి, వారిలో షిమ్యోనుని చూపిస్తూ, మాట్లాడకుండా బయటకు వెళ్ళి తన రథంలో కూర్చున్నాడు. అక్షాపు షిమ్యోనును మాత్రం అక్కడ ఉన్న మంచిగదిలో ఉంచి, మిగిలిన వారిని తీసుకొని ధాన్యము కొలిచే కేంద్రానికి తీసుకెళ్ళాడు.

జప్నత్ప తన గదిలోకి అడుగుపెడుతూనే, ఆసెనతు అతని దగ్గరకి వచ్చి పలకరింపుగా కూర్చుంది. ప్రతిరోజు తను చూసే జప్నత్ప కాదు అని, రెండు రోజుల్నుండి తను యోచిస్తుంది. కాని భర్తను ఏమి అడగలేదు. ప్రక్కనే ఆనుకొని కూర్చున్న భార్యకు కిరీటమందించి విశ్రాంతిగా కూర్చున్నాడు. ఆసెనతు వెళ్ళి స్వయంగా పానీయం తెచ్చి అందించి, ప్రక్కనే కూర్చుని చెప్పండి అన్నట్లుగా చూసింది. ఆమె కళ్ళలోకి చూసిన జప్నత్ప సేదదీరిన వానిలా నిట్టూర్చుతూ....

"ధాన్యం కొనడానికి మా అన్నలు వచ్చారు" అన్నాడు.

ఆసెనతు కళ్ళు పెద్దవి చేస్తూ చూసింది. "తొందరగా వచ్చారే! ఇంకా కొంతకాలం పడుతుంది అనుకున్నాను" అంది జప్నత్ప చెక్కిలి మీద చేయి రాస్తూ. చూసి "అందరూ వచ్చారా?" అని అడిగింది. "అందరూ వచ్చారు. కాని నన్ను పోల్చుకోలేదు." అన్నాడు.

"ఇంటికి తీసుకొని వస్తారా?" అంది కాని, తీసుకొని రాలేదేమని స్ఫురించింది.

"ఈసారి, మళ్ళీ వచ్చినప్పుడు" అన్నాడు జప్నత్ప.

"మామగారి సంగతి! ఆయన క్షేమంగా ఉన్నారా?" అడిగింది అసెనతు. "ఆయన క్షేమంగా ఉన్నాడు. ఈసారి వచ్చినప్పుడు, తమ్ముడ్ని తీసుకొని రమ్మని హామీగా రెండవ అన్నని నిర్భంధంలో ఉంచాను" అన్నాడు. ఆసెనతు తల వంచుకొని ఆలోచిస్తుంది.

"నీకేమనిపిస్తుంది?" అన్నాడు తల నిమురుతూ.

"మామగారిని చూడగలనని నమ్మకం కలుగుతుంది. మళ్ళీ వాళ్ళు తిరిగి రావటానికి రెండు మాసాలు పడుతుందా?" అని అడిగింది.

"ఇంకా ముందే రావచ్చు. షిమ్యోను అన్న బంధింపబడియున్నాడు కదా!" అని చెప్పాడు జప్నత్ప.

యోసేపు లేచి నిలుచున్నాడు. పడమర వైపుగా ఉన్న కిటికీ తెరలు ప్రక్కకు లాగబడి ఉన్నాయి. ఎదురుగా దూరంగా చియోప్స్ పిరమిడ్ కనబడుతుంది. తూర్పు నుండి ప్రతిబింబించిన సూర్యకిరణాలు పిరమిడ్ నుండి తన కళ్ళ

మీదకు కేంద్రీ కృతమైనట్లుగా ఉంది. ఏదైనా తీవ్రంగా ఆలోచించేటప్పుడు కొంచెంసేపు అలా ఎత్తైన ఆ పిరమిడ్‌ని చూస్తూ నిలబడటం జప్నత్తుకు అలవాటు. ఆసెనతు ప్రక్కగా వచ్చి నిల్చుంది. ఆమెను చూస్తూ "రెండువేల సంవత్సరాల నుండి మనలాంటి వాళ్ళు ఎంతమంది మాయమైపోయారో, మనలాంటి వారిని ఆ ఫీనెక్స్ ఎంతమందిని చూసిందో, కోటి మందిలో మనం ఒకరం కదా!" అన్నాడు జప్నత్తు. ఆసెనతు కొంచెం చలించినట్లుగా ఉంది. ఆమె కళ్లలో కొంచెం భయం కనిపించింది.

"మీరు అంతగా తలక్రిందులవటానికి ఇప్పుడేమైంది?" అని అంది.

"క్రొత్త నిజం ఒకటి ఆలస్యంగా అర్థమయ్యింది" అన్నాడు.

తన ముఖం ఇంకా పిరమిడ్‌కి చేరువలో ఉన్న ఫీనెక్స్ చూపు మీద కేంద్రీకృతమై ఉంది. "ఆనాడు వాళ్ళు అసూయ, ద్వేషంతో నన్ను ఐగుప్తుకు అమ్మారు..." అంటూ ఆసెనతు వైపు చూస్తూ, "ఈ ఐగుప్తు నన్ను కొనుక్కుంది" అన్నాడు. ఆమె సిగ్గుపడింది. వివాహం జరిగి ఇప్పటికి తొమ్మిది సంవత్సరాలు గడిచినా నిన్న వివాహం జరిగినట్లుగా సిగ్గుపడింది.

"కాని ఈ ప్రపంచాన్ని ఈ కరవు దర్శించబోతున్నది" అని, నా వారి రక్షణ కొరకు దేవుడు ముందుగా నన్ను ఇక్కడికి పంపించాడు" అన్నాడు. గోడకు కుడిచేయి ఆనించి, ఎడమ చేతితో కిటికీ తలుపు పట్టుకున్న జప్నత్తు ఎదురుగా తన ముఖం పెట్టి "అది అబద్ధం. మీ వారిని ఐగుప్తుకి నడిపించకుండానే ఆహారం అందించగల శక్తి దేవునికి ఉంది" అని ఆగి, జప్నత్తు ముఖంలో చూస్తూ "ఇంతకంటే బలమైన ఏర్పాటు ఆయనకు ఏదో ఉంది అని నా విశ్వాసం" అంది. విశ్వాసంలో ఎంత ఎత్తు ఎదిగిపోయింది అనుకున్నాడు.

"మరి బానిసగా అమ్మబడటం, చెరసాలలో వేయబడటం, ఐగుప్తునకు అధికారిగా ఉండటం, అంతా మా అన్నలు నాయందు ద్వేషం చూపినందున వారి వలననే కదా!" అన్నాడు ఖచ్చితంగా అంతే అన్నట్లు.

"బానిసగా అమ్మబడటం, గృహనిర్వాహకునిగా మారటం ఏమోగాని, చెరసాలలో వేయబడినందువల్ల మాత్రమే ఐగుప్తుకు అధికారి అయ్యారు" అందుకు కారణం ఎవరు? అన్నట్లు చూసింది.

"నా యజమానురాలా?" అన్నాడు.

"అబ్బా... ఇంకా యజమానురాలేనా, ఇంక ఆ మాట మరచిపోరా! ఆమె... రఫియా.....!" అని చిన్నగా మృదువుగా అంది, ఆమె పేరు పలుకుతుంటే ఆసెనతు ఎక్కడో విహరిస్తున్న కన్యలాగ అనిపించింది.

జప్నత్తు ఆసెనతును పొదివి పట్టుకొని, "ఆమె అంటే నీకు ఎందుకు అంత తన్మయత?" అన్నాడు చిన్నగా నవ్వుతున్నట్లు.

"ఆమెను మీ యజమానురాలు అనే భావన ప్రక్కన పెట్టి ఒక స్త్రీగా, మిమ్మల్ని గౌరవించి, ప్రేమించి, ఆరాధించిన అతివగా చూడండి. ఇందులో ఏ దోషము లేదు. దేవుడు ఆమెకు అనుగ్రహించిన స్త్రీ వైభవం చూడండి, తప్పులేదు. ఆసెనతులో మీరు చూచే ప్రతి కదలిక ఆమె సాంగత్యంలో నేను సంతరించుకొనినదే, కాదు ఆమె రూపకల్పనే..." అలా చెప్తూ ఉంది....

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపించాలంటే క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

42

# నా చిత్తానుసారుడు

**(దావీదు జీవిత చరిత్ర)**

**– కొడవటికంటి**

యెబూసు మీద యుద్ధం మొదలైనప్పుడు కనానీయులైన యోధులందరు కోటగోడ మీద వున్నారు. యెబూసు గోడ కూడా యెరికో గోడ అంత కఠినమైనది. మానవులెవరు కోటమీద సైన్యములున్నంత వరకు ఆ గోడ ఎక్కలేరు, కూల్చలేరు. అందువలననే దేవుడే యెరికో గోడలను కూల్చి వేసాడు. నిజానికి యెబూసు కోటను స్వాదీన పరచుకొన లేకనే యెహోషువ దానిని వదలి వేశాడు. ఇప్పుడు దావీదుకు అది ఒక సవాలు. చిన్ననాటి నుండి యెబూసు కొండలు తనకు స్వప్న దృశ్యాలు. ఎప్పటికైనా అవి ఇశ్రాయేలీయులవి. అబ్రాహాము సంతానమునకు అవి ఎనలేని జ్ఞాపకాలు. ఇస్సాకు దహనబలి కట్టెలు మోస్తూ ఈ కొండలలో ఒక కొండ మీదకు వచ్చాడు.

చిన్నతనంలో ఈ కొండ దగ్గరికి గొఱ్ఱెల కాపరులతో కలిసినప్పుడు యెబూసునకు మంచి నీళ్ళు వచ్చే సొరంగం ఒకటి వున్నది.

“అబీషైని పిలిపించండి” అన్నాడు దావీదు.

అబీషై వచ్చాడు.

“మనం చిన్నప్పుడు ఈ కొండలు ఎక్కేవాళ్ళం గుర్తుందా” అన్నాడు దావీదు.

అబీషై ఆలోచిస్తూ “ఔను” అని ఆగి, “అర్ధమైంది” అని లేచాడు.

“ఎక్కడికి” అన్నాడు దావీదు.

“యోవాబునకు చెప్పి వస్తాను” అన్నాడు.

“అంటే యోవాబు సైన్యాధిపతి అవటం నీ లక్ష్యమా?” అన్నాడు దావీదు.

అబీషై మౌనంగా ఉన్నాడు.

రెండవ రోజున యెబూసీయులు దావీదునకు లొంగి పోయారు. అందరికంటే ముందుగా యోవాబు నీళ్ళ సొరంగ మార్గాన యెబూసు కోటలోకి సైన్యంతో ప్రవేశించి దానిని లోబరచుకున్నాడు.

ఇప్పుడు హెబ్రోను నుండి రాజకుటుంబాలు మిగిలిన కుటుంబాలు అన్ని తరలి యెబూసులో కాపురములు పెట్టారు.

మిగిలిన రాణులందరికి వేరు వేరు ప్రాసాదములు కేటాయించాడు. కాని అబీగయీలుకు ఏర్పాటు చేసిన మహలులో మిద్దె మీద నిలుచుండి దక్షిణము తట్టు చూస్తే బేత్లెహేము కనబడుతుంది. మీకాలుకు రాజదర్బారు ప్రక్కనే వున్న పట్టపురాణి నివాసం ఏర్పాటు చేసారు. అబీగయీలు ఇంటి మిద్దె మీద భాగంలోనున్న గదిలో దూరదర్శిని అమర్చ బడి యున్నది. దాని నుండి చూస్తే అయిదు మైళ్ళ దూరంలో నున్న గొఱ్ఱెల దొడ్డి కనిపిస్తుంది. అది ఊరి బయట ఉత్తర దిక్కునున్నది. ఆ దుర్భిణి గదిలో నుండి బయటకు తీసికొని వచ్చి తన కోటలోని అనేక ప్రాంతాలను చూడ వచ్చును. తూర్పు దక్షిణములలో వున్న సైన్యాధిపతుల నివాసగృహాలు, పడమరగా ఉన్న సైనికుల స్థావరాలు కనబడుతుంటాయి. హెబ్రోను నుండి యెరూషలేము లోనికి నివాసములు మారి ఇంకా సరియైన రీతిలో స్థిరత్వం ఏర్పరచక ముందే ఫిలిష్తీయులు యెరూషలేము మీదకి దండెత్తి వస్తున్నారన్న కబురు వచ్చింది. తాను ఇంతకుముందు ఊహించినదే జరిగింది. యెబూసీయుల రాజు అక్కడ ఉన్నంత కాలం ఫిలిష్తీయులు ఆ ప్రాంతమంతా వారి ఆధీనంలో ఉన్నట్లే భావించారు. ఎంత స్నేహితుడైనా దావీదును యెబూసురాజుగా అంగీక రించదలుచుకోలేదు. అదీకాక ఇప్పుడు అన్నీ గోత్రాల వారు ఒకటయ్యారు. కాబట్టి ఇశ్రాయేలీయుల రాజ్యమును మొక్కలోనే త్రుంచివేయాలని అనుకున్నారు. పడమరగా రెఫాయిము వరకు వచ్చేసారు. వారు అంత వేగంగా యెరూషలేముకు ఎలా చేరగలిగారో అబీషైకాని, యోవాబు కాని చెప్పలేకపోయారు. వారు కేవలం షావూలు తెచ్చే వర్తమానం మీదనే ఆధారపడియున్నారు. ఫిలిష్తీయులకు కావలసింది దావీదు మాత్రమే. దావీదును చిక్కించుకుంటే మొత్తం ఇశ్రాయేలీయులు లొంగినట్లే. వెంటనే దావీదు

కొందరు ముఖ్యులైన వారిలో యిర్మీయా, అత్తయి, ఎలీయే లును కొంత సైన్యమును తీసుకొని ప్రాకారంవంటి కోటవలె వుండే అదుల్లాముకు వెళ్ళేటప్పుడు అబ్యాతారును వెంట తీసుకొని వెళ్ళాడు.

ఫిలిష్తీయులు దావీదు యెరూషలేములోనే ఉన్నాడను కుంటున్నారు. అదుల్లాములో అబ్యాతారు ఏఫోదు ధరిం చాడు. దావీదు దేవుని సన్నిధిని కూర్చుండి "నేను ఫిలిష్తీయుల కెదురు పోయెదనా? వారిని నాచేతికప్పగిం తువా?" అని అడిగాడు.

"పొమ్ము, నిస్సందేహంగా వారిని నీచేతికప్పగించెదను" అని వర్తమానం తెలిసిన వెంటనే దావీదు రెఫాయిములోనికి సైన్యంతో దిగిన వాళ్ళను ఎదుర్కొన్నాడు. ఫిలిష్తీయులు అధికంగా హతులయ్యారు. ఆ స్థలంవద్ద ఫిలిష్తీయుల దేవతల బొమ్మలు విరివిగా పడవేయబడి యుండినవి. అవి లోహ విగ్రహాలు సైనికులకు కత్తులు చేయుటకు పనికి వస్తుంది. కనుక ఆ ప్రదేశమునకు బయల్పెరాజీము అని పేరు పెట్టారు.

ఒక నెల గడవక ముందే మరలా దండెత్తి వస్తున్నారని కబురు వచ్చింది. ఓడిన వాడికి ఉలుకెక్కువ అని దావీదు ఈసారి మరీ తేలికగా వారిని జయించవచ్చు. కాని దేవుని చిత్తం తెలుసుకోకుండా ఒక్క అడుగు కూడా వెయ్యదలచు కోలేదు. మరల దేవుని సన్నిధిలో నిలిచాడు. నీవు వెళ్ళవద్దు, చుట్టు తిరిగిపోయి కంబళి చెట్లకు ఎదురుగా వారిమీద పడుము. కంబళి చెట్ల కొనల చప్పుడు వినగానే ఫిలిష్తియు లను హతము చేయుటకై యెహోవా బయలుదేరుచున్నాడు గనుక అప్పుడే నీవు త్వరగా బయలుదేరవలెనని సెల విచ్చెను.

ఈసారి యోవాబును పిలిచి సైన్యమును గిబియా మీదుగా గిబియోను వైపు తిరిగి వచ్చి రెఫాయిము లోయలో కంబళిచెట్లకు దగ్గరలో కాపు కాయుము అన్నాడు. ఫిలి ష్తీయుల సైన్యము కదులునప్పుడు కంబళి చెట్లు కదులు తాయి అదే సూచన అన్నాడు. చెప్పిన ప్రకారమే జరిగింది. ఫిలిష్తీయులు ఈసారి పూర్తిగా హతులయ్యారు. చాలాకాలం వరకు దావీదువైపు కన్నెత్తి చూడలేకపోయారు. ఫిలిష్తీయులు, గెబ, గెజరు కూడా వదులు కోవలసి వచ్చింది. ఫిలిష్తీయులే కనుక వారంతటవారు యుద్ధమునకు రాకపోయినట్లయితే దావీదు మనసు ఎప్పుడూ యుద్ధం గురించిన ఆలోచనలతో ఉండేది. ఫిలిష్తీయులు ఏ సమయంలో యుద్ధానికి వస్తారో నన్న ఆలోచనతో మిగిలిన ఆలోచనలకు తావుండేది కాదు. ఇప్పుడు ఈ ఊహించని ఉపద్రవం జరిగి పోవడమే కాకుండా ఇప్పట్లో ఫిలిష్తీయులు తిరిగి కోలుకోలేనంత దెబ్బతిన్నారు.

ఇప్పుడు దావీదు యూదా, ఇశ్రాయేలీయులు కలిసిపోయి విడదీయలేని విధంగా ముడివేయాలంటే ఆరాధనా స్థలం తన రాజధానిలో ఉండాలి. మందసం యెరూషలేము రావాలి. తనకు, తన భార్యలకు, ఉపపత్నులకు నగరు కట్టించాలి.

ముందు మందసం తీసుకొని వచ్చే నెపంతో ఇశ్రాయేలు పెద్దలను ఒకచోట చేర్చాలి. కనుక పన్నెండు గోత్రాల పెద్దలను యెరూషలేము రావలసినదిగా కబురు చేశాడు. మందసం రాజ్యంలోనికి చేరితే ఆరాధన మీద ఆసక్తి పెరుగుతుంది. వంశాల చొప్పున గోత్రాల స్థానాల చొప్పున ఐగుప్తు నైలునది వద్ద నుండి హమాతునకు పోయే మార్గం వరకు కూడా చెదరియున్న గోత్రముల వారినందరిని ఆహ్వానించాడు.

అబీనాదాబు ఇంటి వద్ద ఒక అందమైన కొత్త బండిని తయారు చేయుటకు వడ్రంగి వారిని పంపించాడు. వారు మందసమును తీసుకొని వచ్చుటకు ఒక క్రొత్తబండిని తయారు చేశారు. ఇశ్రాయేలు దేశమంతటా ఎక్కడ చూసిన ఏ నోటవిన్నా మందసము మాటే. ఇప్పుడున్న తరము వారిలో ఆ మందసం అబీనాదాబు ఇంట్లో వున్నట్లు మాత్రమే తెలుసును. కాని దానిని గూర్చిన ఆసక్తి ఎవరికి లేదు, అవసరం కూడా లేదు. ఇప్పుడు మందసమును రాజధానికి తీసుకొని రావడానికి రాజు చేస్తున్న ఆర్భాటం వలన ప్రజలలో చైతన్యం వచ్చింది. ఇందులో ఏదో మహత్తు వున్నది, అది చూడాలని ఆసక్తి అందరికి కలిగింది.

**(సశేషం)**



# ‘భయము విడిచి’



‘భయమా? నాకా? నెవ్వర్’, ‘డోంట్ కేర్’ అనే మాటలు ఈ లోక సంబంధమైన భయాల విషయాల్లోనే తప్ప దేవునికి భయపడే విషయంలో మాత్రం అనలేరు. ఎందుకంటే దేవునికి భయపడాలనే విషయం చాలామందికి తెలియదు. దేవుడంటే భక్తి ప్రదర్శిస్తారు కానీ భయపడరు. చర్చికి వెళ్ళేవాళ్ళంతా తమ భక్తి ప్రదర్శించడానికి తప్ప దేవునికి భయపడి మాత్రం వెళ్ళరు. భక్తిగా వెళ్ళేవాళ్ళు కూడా తక్కువే. అలవాటు ప్రకారం, టైంపాస్‌కి, నిద్రపోడానికి, తమ హంగూ ఆర్భాటం ప్రదర్శించుకోడానికి వెళ్ళేవాళ్ళే ఎక్కువమంది. ఆ భక్తి కూడా చర్చిలో ఉన్నంతసేపే ఉంటుంది తప్ప ఇంటికి వెళ్ళాక ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ అన్యజనుల కంటే ఘోరంగా ఉంటారు. తిట్టుకుంటారు, కొట్టుకుంటారు, టి.వి.లో, యూట్యూబ్‌లో సినిమాలు, సీరియల్స్ చూస్తూ, సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటూ, చాటింగ్ చేసుకుంటూ మళ్ళీ ఆదివారం వచ్చేదాకా దేవుడు గుర్తుకు రానంతగా ఈ లోకసంబంధమైన కార్యక్రమాల్లో మునిగి తేలుతూ ఆదివారపు క్రైస్తవులుగా, నామకార్థ క్రైస్తవులుగా ఉంటారు. ఇలాంటి భక్తి ప్రదర్శించే వారు దేవుని శక్తిని గురించి ఆలోచించరు, ఇంకా చెప్పాలంటే అసలు దేవుని గురించే ఆలోచించరు కాబట్టి వారికి దేవుని భయము ఉండదు. పైకి మాత్రమే భక్తి, లోపలంతా కుయుక్తి ఉంటుంది. ‘పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు’ (2తిమోతి 3:5) అని ఇలాంటి వారి గురించే చెప్పబడింది. వారి లిస్టు చాలా పెద్దదే ఉంది. ఈ లిస్టులో మనం ఖచ్చితంగా ఉంటాము. అంటే దేవునికి భయపడ కుండా పైకి భక్తి నటించేవారికి ఏ గుణాలు ఉంటాయో ఆ లిస్టులోని గుణాలలో ఏదో ఒక గుణము మనకి ఖచ్చితంగా ఉంటుంది. కావాలంటే ఒకసారి చెక్ చేసుకోండి. “స్వార్థ ప్రియులు, ధనాపేక్షులు, బింకములాడువారు, అహం కారులు, దూషకులు, తలిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞత లేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జన ద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటె సుఖానుభ వము నెక్కువగా ప్రేమించువారు” (2తిమోతి 3:2-4). ఒకవేళ మీరు నిజాయితీపరులని మీరు అనుకుంటే పై లిస్టులో ఉన్న గుణాలలో మీకు ఎన్ని ఉన్నాయో ఒక పేపరు మీద రాసుకొని చూడండి మీకే అర్థమవుతుంది మీరు దేవునికి భయపడేవారో కాదో. అయితే ‘దేవునికంటె సుఖాను భవమును ఎక్కువగా ప్రేమించే’ గుణము మాత్రము ప్రతి ఒక్కరికీ ఉంటుంది. మనం దేవునికి భయపడక పోవడానికి ఈ గుణాలన్నీ కారణమవుతుంటాయి. మనం దేవునికి వ్యతిరేకమైన జీవితం జీవిస్తూ, ఎన్ని పాపాలు చేసినా వెంటనే శిక్ష రావడం లేదు కాబట్టి భయపడకుండా పాపాలు చేస్తూనే ఉంటాము. “దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగక పోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా దుష్క్రియలు చేయుదురు” (ప్రసంగి 8:11) అని చెప్పినట్లు దేవుడంటే భయములేని జీవితం జీవించే వారికి మిన్ను విరిగి మీద పడినట్లుగా హఠాత్తుగా నాశనం వస్తుంది. ‘ఎన్నిసార్లు గద్దించినను లోబడనివాడు మరి తిరుగు లేకుండ హఠాత్తుగా నాశనమగును (సామెతలు 29:1). అయినా పర్వాలేదు **‘డోంట్ కేర్’** అని దేవునికి మనస్సులో చోటివ్వకుండా దేవుడంటే భయము విడిచి ఇష్టానుసారమైన జీవితం జీవించాలనుకుంటే చేయరాని కార్యాలు చేయడానికి దేవుడు మిమ్మల్ని భ్రష్టమనస్సుకు అప్పగిస్తాడు (రోమా 1:28). ‘బెస్ట్ ఆఫ్ లక్’.


**ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు**

**9 4 4 0 2 1 7 7 2 6**

# మీరు బైబిలంతా చదివేశారా?

**"యెహోవా గ్రంథమును పరిశీలించి చదువుకొనుడి" (యెషయా 34:16).**

వయస్సుతో సంబంధం లేకుండా 'మీ జీవితకాలంలో ఒక్కసారైనా బైబిలు పూర్తిగా చదివారా?' అని అడిగితే, ఒకరు ఇద్దరు మినహా మిగిలిన వాళ్ళ దగ్గర్నుండి వచ్చే సమాధానం 'లేదండీ' అని. వృద్ధాప్యం వచ్చినా వారి జీవితకాలంలో ఒక్కసారి కూడా బైబిలు పూర్తిగా చదవని క్రైస్తవులు ఉన్నారంటే చిన్నవాళ్ళు, యౌవనస్థుల గురించి ఏం మాట్లాడగలం. 'ఎందుకు చదవలేకపోయారండీ' అని అడిగితే ఏవో కారణాలు చెప్తారే తప్ప, అసలు అలాంటి ఆలోచనే రాలేదని చెప్పరు. ఈ రోజుల్లో బైబిలు ఒక అలంకార ప్రాయంగానే మారింది. చర్చికి వెళ్ళేటప్పుడు తీసుకెళ్ళడానికి తప్ప వ్యక్తిగతంగా చదవటానికి ఎవరూ ఉపయోగించటంలేదు. చాలామంది క్రైస్తవులకి బైబిల్లో ఎన్ని పుస్తకాలు ఉన్నాయో తెలియదు. దేవుడిచ్చే వాగ్ధానాల కోసం కీర్తనలు, యెషయా గ్రంథం తప్ప బైబిలు మొత్తం పూర్తిగా చదివేవాళ్ళే లేరు. దేవుని దృష్టిలో వెఱ్ఱితనమైన ఈ లోక జ్ఞానము సంపాదించడానికి స్కూల్, కాలేజీ చదువులకు సంబంధించిన పుస్తకాలు చదవడానికి చూపించే ఆసక్తి మన జీవితాలను మార్చివేసే జీవగ్రంథానికి ఇవ్వటంలేదు. టి.వి.లో సినిమాలు, సీరియల్స్ చూడటానికి, వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వాడటానికి ఎంత సమయం కేటాయిస్తారో ఆలోచించండి. మనకి ఉపయోగపడని వాటికోసం సమయం ఎంత వృధా చేస్తున్నామో కదా! ఆ వృధాచేసే సమయంలో కొంత బైబిలును పూర్తి చేయాడానికి కేటాయించలేక పోతున్నారంటే సాతానుకి ఎంతగా బంధీలుగా మారిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. మనుష్యుల మధ్య శాంతి సమాధానాలు నెలకొల్పి ఒకరినొకరు ప్రేమిస్తూ సంతోషంగా ఉండటం కోసం సుదీర్ఘకాలం అనేక మందిచే వ్రాయించబడిన పరిశుద్ధ గ్రంథం మొత్తం ఇప్పటి వరకు మీరు పూర్తిగా చదవక పోయినట్లయితే ప్రభువైన యేసుక్రీస్తు రెండవ రాకడకు ముందే బైబిలు చదవడం పూర్తి చేయండి. మనుష్యులను బైబిలు చదవనీయకుండా దేవునికి దూరం చేయడానికి సాతాను పన్నిన కుట్రలో అందరూ చిక్కుకొని దిగ్విజయంగా సాతానుని గెలిపిస్తు న్నారు. ప్రతిరోజు 5 అధ్యాయాలు చదివితే సుమారు ఏడు నెలలు పడుతుంది. 5 అధ్యాయాలు చదవడానికి 30 నిమిషాలు పడుతుంది. దేవుని కోసం ఆ మాత్రం సమయం కేటాయించలేరా? అనారోగ్యంతో ఉన్నప్పుడో, కష్ట కాలం లోనో బైబిలు చదవటం కాదు. ప్రతిరోజూ బైబిలు చదవడం అలవాటు చేసుకోవాలి. బైబిలు చదవడం బోరు కొడు తుందని, అర్థం కావడంలేదని ఇలా అనేకమైన కారణాలు చెప్పడం అర్థరహితం. రాబోవు రోజులలోదేవుని వాక్యము దొరకని కాలము వచ్చుచున్నది. అప్పుడు దేవుని వాక్యమును వెదకినా దొరకదు. మనఃస్పూర్తిగా బైబిలు గ్రంథమును పూర్తిగా చదవాలి అనుకుంటే దేవుడు తప్పక సహాయం చేస్తాడు. ***"ఇదిగో ఇప్పుడే మిక్కిలి అనుకూలమైన సమయము, ఇదిగో ఇదే రక్షణ దినము"*** (2కొరింథీ.6:2). బైబిలు పూర్తిగా చదవటం ఒక సవాలుగా తీసుకుని నేడే చదవటం ప్రారంభించండి. బైబిలును పూర్తి చేయడానికి నీవు సిద్ధమైతే దేవుడు నీకు సహాయపడతాడు.

### సాక్ష్యాలకు ఆహ్వానము

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడలవాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# సృష్టికర్త

దేవుడు మానవుని కొరకు చేసిన సృష్టిలో మూడవ దినము చేసిన అత్యద్భుతమైన భూమి (ఆరిన నేల) జీవమునకు ఉనికిపట్టు. (ఆది 1:10)

మూడవ దినమున దేవుడు నేలమీద రకరకాల జాతుల వృక్షాలు, మొక్కలు, గడ్డిని వాటివాటి జాతి ప్రకారం సృష్టించాడు. "దేవుడు – గడ్డిని విత్తనములిచ్చు చెట్లను భూమి మీద తమ తమ జాతి ప్రకారము తమలో విత్తనములు గల ఫలమిచ్చు ఫలవృక్షములను భూమి మొలిపించుగాకని పలుకగా ఆ ప్రకారమాయెను" ఆది. 1:11

ఈ భూమ్మీద ఉన్న వృక్షజాతులు దాదాపు మూడు ట్రిలియన్‌ల కంటే ఎక్కువ. అంటే ఈ సంఖ్య మన విశ్వంలోని నక్షత్రాల కంటే ఎక్కువ. భూమి మీద మానవ మనుగడకు చెట్లు అత్యంత ఆవశ్యకం. ఎందకంటే మొక్కలు కిరణజన్య సంయోగ క్రియను జరిపి వాతవరణంలోని కార్బన్‌డైయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. మొక్కలు విడుదల చేసే ఆక్సిజన్ మానవులకు ప్రాణ వాయువు. చెట్లు కేవలం మనకు ప్రాణవాయువు ఇవ్వడమే కాక వాతావరణ కాల్యుష్యానికి కారణమయ్యే కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించడం వలన వాతావరణ సమతుల్యానికి దోహదపడుతున్నాయి.

మనిషి మనుగడకు అవసరమైన ఆహారంగా మొక్కలు, కాయగూరలు ఫలాలు, ఔషధాలుగా ఆకులు, వేర్లు, రకరకాల పారిశ్రామిక ఉత్పత్తులుగా గింజలు, తద్వారా తయారయ్యే అనేక రకాల పదార్థాలు మన దైనందిన జీవితంలో భాగము.

మనుష్యులలో మాంసాహారులు, శాఖాహారులు ఉన్నట్లే మొక్కలలో కూడ కొన్ని మాంసాహార మొక్కలు ఉంటాయి. ఇవి తమపై వాలిన చిన్న చిన్నపురుగులను కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి.

ఎడారి ప్రాంతంలో పెరిగే మొక్కలు వాటి కాండములో నీటిని నిలువ ఉంచగలవు.

ఇప్పటికి శాస్త్రవేత్తలు కనుగొన్న అతిపురాతనమైన చెట్టు కాలిఫోర్నియాలో ఉంది. దాని వయస్సు దాదాపు 4800 సంవత్సరాలు.

కొన్ని జాతుల మొక్కలు కొన్ని వేల సంవత్సరాల వరకు తమ జీవాన్ని కలిగి ఉంటాయయట. ఉదా॥ తామర గింజలు ఒక సంవత్సరం తరవాత కూడా అంతే వేగంగా మొలకెత్తుతాయట.

వెదురు చెట్లు ఒక్క రోజులో దాదాపు ఒక కిలోమీటర్ వరకు ఎదుగుతాయట.

ఆధునిక వైద్యరంగం సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికి ఇప్పటికి 70 శాతం ఔషధాలు (మందులు) మొక్కల నుండి తయారు చేయబడుతున్నాయి.

కొన్ని ఎకరాల విస్తీర్ణంలో మొక్కలు, చెట్లు ఉంటే దానినే మనం అడవి అంటున్నాం. ఇవి రకరకాల వన్యమృగాలకు, పక్షలకు ఆశ్రయమౌతాయి.

భూమ్మీద అతి పెద్దది, మరియు అతి ప్రమాదకరమైన అడవి అమెజాన్ అడవి. ప్రపంచం మొత్తానికి కావలసిన ఆక్సిజన్ దాదాపు 20% ఆక్సిజన్ ఈ అడవి నుండి ఉత్పత్తి అవుతుంది.

మానవ మనుగడకు తోడ్పడే విధముగా, నివాసానికి అవసరమైన అన్ని రకాల మొక్కలను, రకరకాల ఫలాలను అందించే వృక్షజాతులను దేవుడు కలుగజేయుట మానవునిపై దేవుని శ్రద్ధకు నిదృనం. మానవ మేధస్సు అంచనాలకు కూడా అందని ప్రకృతిని సృష్టించి ఉచితంగా అందరికి అందుబాటులో ఉంచి తన కృపను కనపరుస్తున్న సర్వోన్నతునికి మహిమకరంగా జీవించి కృతజ్ఞతలు తెలియజేయుట ప్రతి క్రైస్తవుని నైతిక బాధ్యత.

సాక్ష్యము

# నూతన సృష్టి

నా పేరు సుల్తానా. నేను ముస్లిం కుటుంబమునకు చెందిన వ్యక్తిని. మా కుటుంబములో నేను రెండవ సంతానం. సనాతనాచారములో నిష్ఠగల ముస్లిమ్ మా నాన్నగారు. ఆయనకు మతమంటే ఎక్కువ ప్రీతి. పోలీసుశాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేసేవారు.

మా తల్లిదండ్రులకు వివాహమైన కొన్ని సంవత్సరాల వరకు సంతానం కలుగలేదు. భారతదేశంలో బిడ్డలు లేని స్త్రీని గొడ్రాలుగా చాలా న్యూనత భావంతో చూస్తారు. బిడ్డల కొరకై ఎంతో నిష్టగా అల్లాని వేడుకునేవారు. కాని ఎన్ని నమాజులు చేసినా, ఎన్నిసార్లు రోజంతా ఉపవాసం ఉన్నా బిడ్డలు కలుగలేదు. బిడ్డలు కావాలనే భారంతో ఉన్న అమ్మకు ఇరుగు పొరుగువారి ద్వారా యేసుక్రీస్తు గురించి తెలిసింది. యేసును నమ్ముకుంటే పిల్లలు పుడతా రని తలంచి అమ్మ దేవున్ని ప్రార్థించడం మొదలుపెట్టారు. చాలా ప్రార్థించేవారు. క్రీస్తు గొప్ప దేవుడని అవసరాలు తీర్చు దయామయుడని గ్రహించి ప్రార్థనలో గడిపేవారు. రోమా 8:24, దేవుని దృష్టితో ఒక వ్యక్తి స్మరించ తరిస్తే ఎవరినో ఒకరిని స్పష్టంగా వ్యక్తిగతంగా మనుష్యులను పట్టు జాలరిగా సిద్ధపర్చగలరు. అమ్మ ప్రార్థనల ఫలితంగా దేవుడు ఆమె గర్భాన్ని తెరిచారు. ఒక బిడ్డనిచ్చి ఆశీర్వ దించారు. ఈ అద్భుత సంఘటన ఆమెకు నిజ దేవుని వెదకాలని సత్యాన్ని గ్రహించాలనే తపన కలిగించింది. ఆ ప్రభువును గూర్చిన సత్యాన్ని కనుగొని క్రీస్తును స్వీయ రక్షకునిగా అంగీకరించారు.

ముస్లిమ్‌గానే ఉంటున్న నాన్నగారు అమ్మలో క్రీస్తు పట్ల విశ్వాసాన్ని గమనించి హింసించి హీనపరచటం మొదలుపెట్టారు. దేవుని ఆత్మ ఆదరణకర్త ఆమెను ఓదార్చింది. సజీవుడైన క్రీస్తు ప్రేమా స్వరూపి, దీనులకు అండ. బాధింపబడు వారి పక్షంగా ఉండే దేవుని స్మరిస్తూ ధైర్యపడేవారు.

ప్రథమ సంతానం మా అన్నయ్య, నా తర్వాత ఐదు మంది తోబుట్టువులున్నారు. క్రీస్తు విశ్వాసిగా మా అమ్మగారు మా అందరినీ దైవ భయంలో పెంచారు. రోజుకు మూడుసార్లు వాక్యాన్ని పఠిస్తూ ప్రార్థిస్తూ ఉండే దైవిక ధ్యానం వల్ల నేను చాలా పవిత్రురాల్ని అనే భావంతో ఉండేదాన్ని. నేను నా స్వనీతిపై ఎక్కువ ఆధారపడేదాన్ని, క్రమేణా, నేను పాపిననే అవగాహన కల్గింది. ఈ గ్రహింపు ఇంకా సుస్పష్టంగా దివ్య వాక్య వెలుగులో అర్థమైంది (రోమా 3:10). నేనీ భావాలతో నలిగి ఉన్నప్పుడు, మా సన్నిహితులు "నీవు రక్షింప బడ్డావా? నీవు రక్షింపబడ్డావా? నీకు రక్షణానుభవం ఉందా?" అని సూటిగా నన్ను ప్రశ్నించారు. నా దగ్గర సరియైన జవాబులేదు. ఆందోళనతో ఉండే సమయంలో ***"యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల, నీవు రక్షింపబడుదువు"*** రోమా 10:9 అనే వాక్యంపై నా దృష్టిపడింది. కన్నీటితో దేవున్ని ఆశ్రయించాను. నా ప్రభువా నేను నిన్ను గాఢంగా విశ్వసిస్తున్నాను కాని రక్షణను గూర్చిన సరియైన అవగాహన నాకు అంతు పట్టడం లేదు. భారభరిత హృదయంతో దేవుని సన్నిధిలో చాలా తీవ్రంగా ప్రార్థించాను. జీవితంలో సరియైన మార్పు రాలేదు. అనుకోని రీతిగా ఒకరోజు 1975వ సంవత్సరం అక్టోబరు నెలలో విక్టోరియమ్మగారు కాకినాడలో ప్రత్యేకంగా స్త్రీలకై ఏర్పాటు చేసిన మీటింగ్‌కి హాజరయ్యాను.

***"యెహోవా, నాకు కలిగిన అన్యాయము నీవు చూచి యున్నావు. నా వ్యాజ్యము తీర్చుము"*** (విలాప.3:59).

దైవవాక్య ధ్యానంగా విక్టోరియమ్మగారు గంభీరమైన ప్రసంగం చేస్తుండగానే, ఆ వాక్యం సూటిగా నా హృదయాన్ని తాకింది. నాకు నిజమైన ఒప్పుకోలు

అనుభవమైంది. సినిమా రీలు తిరిగినట్లు నాలో దాగిన ఒక్కొక్క పాపము నాకళ్ళ ఎదురుగా కన్పించడం ఆరంభించగా పాప క్షమాపణ కొరకై దేవుని వైపు చూచే సమయంలో గతంలో నేనిష్టపడి చదివిన అసభ్యకరమైన నవలలు చీట్ల పేకాటలు మద్యపానాన్ని రుచి చూడటం అవన్నీ నా మనస్సులో మెదిలాయి. స్వనీతి కార్యాల ద్వారా ఏ వ్యక్తి తనను తాను రక్షించుకొనలేడు అనే సత్యము, అమూల్యమైన ప్రభువైన యేసుక్రీస్తు సిలువలో కార్చిన విలువైన రక్తధారల వలననే ప్రతి వ్యక్తి పాపము పరిహరింపబడుననే సత్యము నాకు స్వీయానుభవమైనది. దేవుని సన్నిధిని నా పాపములను పరిహరింపుమని పశ్చాత్తాప హృదయంతో నిశ్చయంగా క్షమాపణ వెదకి దానికై గోజాడి ప్రార్థించాను. ఆ ప్రభువు నన్ను పరమా నంద భరితురాల్నిగా శాంతి సమాధానంతో నింపాడు. ***"కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను"*** (2 కొరింథీ. 5:17).

ఈ బంగారు వాక్యము నాకు రక్షణస్థిరతనిచ్చి నేను రక్షణ పొందానని ధైర్యంగా చెప్పగల కృపనిచ్చింది. దేవుడే వాక్యం ద్వారా స్పష్టంగా మాట్లాడారు. నేను దేవునికి సంపూర్ణ సమర్పణ చేసికోడానికి వాక్యం సహకరించింది. అదే నా రక్షణ దినము. క్రీస్తుని నా జీవితంలో ఆహ్వా నించిన రోజు. అత్యానందంతో నా జీవితంలో ఉప్పొం గిన సంతోషాన్ని అనుభవించాను. అదే సమయంలో నా వివాహ సమస్య రేకెత్తింది. చాలాసార్లు విశ్వాసులు అవిశ్వాసులతో జోడుగా ఉండరాదనే సత్యాన్ని చదివాను. నిశ్చయంగా నేనొక క్రైస్తవ విశ్వాసినే వివాహం చేసికోవా లని నిర్ణయించుకున్నాను. నా నిర్ణయం తెలుసుకున్న మా నాన్నగారు తీవ్ర కోపంతో మండిపడ్డారు. నా బొందిలో ప్రాణముండగా నా ఇంట్లో క్రైస్తవ వివాహానికి తావులేదని స్పష్టంగా చెప్పేసారు. అంతేకాక ఇంటిలో నుండి తరిమి వేయగలనని బెదిరించారు. గుండెలనిండా బాధల్ని భరించ డానికి చాలినంత ఓర్పు, కృప ఆ దేవుడే మాకను గ్రహించారు, హల్లెలూయా! భయపడరాదు, నేను మీతో ఉన్నానని వాగ్దానం ఆధారంగా ఆ దేవుడు అమిత ఆధ్యాత్మిక బలాన్నిచ్చి బలపరిచారు. దేవుని వాక్యము పరిపూర్ణమైనది సత్యమైనది. దేవుడు చేసిన కార్యాలు అమూల్యమైనవి. అద్భుతమైనవి ఎందుకంటే బెహరాన్‌లో ఉద్యోగిగా ఉన్న నవీన్‌సుందర్‌గారితో నా వివాహానికి మా నాన్నగారు అంగీకరించారు. ఇది కేవలం ప్రార్థనా ఫలితమే. మా నాన్నగారు హృదయపూర్వకంగా, తన పూర్తి సమ్మతితో నా వివాహాన్ని వైభవంగా జరిపించారు. నా జీవితంలో అది కేవలం ప్రభువు చేసిన అద్భుతం. నా భర్త నాకన్నివిధాల సహకరించే వ్యక్తి. ప్రస్తుతం మాది క్రీస్తు కేంద్రిత కుటుంబం. మా జీవితాశయం అభిలాష ఒక్కటే. అదే ఈ లోకంలో దేవుని మహిమపర్చడానికే జీవించాలని, ఆ దేవుని సేవ చేయాలనే మా కోరిక. నా వివాహ జీవితంలో దేవుడిచ్చిన అమూల్య వరాలు నా ముగ్గురు బిడ్డలు హైడ్, యూనోష్, నోవా.

నన్ను సర్వసత్యములోనికి నడిపించి అద్భుతంగా నాకెన్నో ఉపకారాలు చేసిన దేవునికి స్తుతులు. నేను నా కుటుంబం యెహోషువవలె **"నేనును నా యింటి వారును యెహోవాను సేవించెదము".**

నా ముస్లిమ్ స్నేహితులు, హిందూ స్నేహితులు అంతా యేసుక్రీస్తును స్వీయరక్షకునిగా స్వీకరించి నిత్య జీవితాన్ని పొందాలని ఆ క్రీస్తును వినయంతో ప్రార్థిస్తు న్నాను. ప్రైస్ ద లార్డ్. ఆమేన్.


## కొడవటికంటి రచనలు

**అపొస్తలుడు** - **రూ. 250/-**
(అపొస్తలుడైన పౌలు కథ - నవల)

**జప్నత్పనేహు** - **రూ. 250/-**
(యోసేపు కథ - నవల)

**నా చిత్తానుసారుడు** **రూ. 250/-**
(దావీదు కథ - నవల)


**మిక్కిలి సాత్వికుడు** **రూ. 150/-**
(మోషే కథ - నవల)

## ఇశ్రాయేలుకు (క్రైస్తవులకు)
# తెలివిలేదు, యోచింపరు

వాక్యం తెలియని క్రైస్తవులు అబద్ధ బోధకుల ఉచ్చులో చిక్కి దేవునికి దూరమవుతున్నారు. బైబిలు ఏం చెప్తుంది అనే దానితో సంబంధం లేకుండా, మనుష్యులు కల్పించిన పద్ధతులను అనుసరిస్తూ, ఈ లోకానుసారముగా జీవిస్తూ చర్చికి వెళ్తే చాలు పరలోకరాజ్యము వెళ్తామన్న భ్రమలో నేటి క్రైస్తవులు ఉన్నారు. క్రైస్తవులు క్రైస్తవులుగా కాక అన్యజనులవలె జీవిస్తున్నందున్న వారిని చాలా సుళువుగా దేవునికి దూరం చేస్తుంది సాతాను. సాతాను తానే వెలుగు దూత వేషము ధరించి చర్చిలోకి ప్రవేశించిన తర్వాత దేవుని ఆలోచనల ప్రకారం కాకుండా మనుష్యుల ఆలోచనల ప్రకారం సంఘము నడిపింపబడుతుంది. సత్యమును బోధించే వారితో సంఘము నడిపింపబడటం ఇష్టములేని సాతాను కుప్పలు తెప్పలుగా అబద్ధ బోధకులను తయారుచేసి వారితో సంఘములు స్థాపించి మనుష్యులను దేవునికి దూరం చేయడమే లక్ష్యముగా సాతాను బలంగా పనిచేస్తుంది. బైబిలు జ్ఞానములేని వారంతా అబద్ధ బోధకుల ఉచ్చులో చిక్కి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. *"దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యము తోను ఆరాధింపవలెననెను"* (యోహాను 4:24) అని యేసుప్రభువు చెప్పాడు కాబట్టి, దేవున్ని డ్యాన్సుల ద్వారా శారీరకంగా, మనుష్యులు కల్పించిన పద్దతులతో అబద్ధముగా ఆరాధించేలా సాతాను ప్రణాళికలు రచించి లోక సంబంధ మైన పద్ధతులను చర్చీలో ప్రవేశపెట్టింది. అసంబద్ధమైన డాన్సలతో, డి.జె. సౌండ్స్‌తో చర్చి దద్దరిల్లిపోతుంది. అభం శుభం తెలియని సండేస్కూలు పిల్లలకు సినిమా స్టెప్స్‌తో దేవుని పాటలు నేర్పించి చర్చీలో ప్రదర్శించడం దేవుని చిత్తమా? 'దావీదు నాట్యము చేశాడు' అని బైబిల్లో ఎక్కడో వ్రాయబడిన ఒక వాక్యాన్ని ఆధారం చేసుకొని అది దేవుని చిత్తము అన్నట్లు భ్రమ కల్పించడం సాతాను కుట్రలో భాగమని క్రైస్తవులు ఎవరూ ఆలోచించడం లేదు. 'మీ శత్రువులను ప్రేమించండి, మిమ్మును హింసించేవారి కొరకు ప్రార్థించండి, మిమ్మును మీరు తగ్గించుకోండి' అని బోధించాల్సిన చోట ఆధిపత్యము కోసం తిట్టుకోవడం, కొట్టుకోవడం, అన్యుల మధ్యలో దేవుని నామము అవమానపరిచేలా ప్రవర్తించడం సాతాను కుట్రలో భాగము కాదా? దీనంతటికీ కారణం చర్చీకి వెళ్ళే వారికి వాక్యము తెలియక పోవడమే. అందుకే అబద్ధ బోధకులు చెప్పేది నిజమని నమ్ముతున్నారు. దేవుడు ఇచ్చిన తెలివితో వాస్తవాల గురించి ఆలోచించలేని స్థితిలో నేటి క్రైస్తవులు ఉన్నారు. పౌలు, సీలలు బెరయలో వాక్యము బోధించినప్పుడు, వారు చెప్పిన వాక్యము సరైనవో కావో అని వారు ప్రతిదినము లేఖనములను పరిశో ధించుచు వచ్చారని వ్రాయబడింది (అపొ.కార్య.17:11). ఈ రోజుల్లో బైబిలును పరిశోధించి చదివేవారు లేరు. అందుకే అబద్ధ బోధకులు చెప్పిన మాటలు విని మోసపోయే వారే ఎక్కువ మంది. *"మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి"* (యాకోబు 1:22). విన్న వాక్యము సరైనదో కాదో బైబిలు చదివి పరిశీలనగా తెలుకోలేని క్రైస్తవులు మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములుగానే భావించి వారి నాశనాన్ని వారే కొని తెచ్చుకుంటారు. క్రీస్తు రెండవ రాకడ అతి సమీపమైయున్న తరుణంలో తమ ఆత్మలను రక్షించుకోవాలంటే బైబిలును పరిశీలనగా చదివి, ఆత్మతోను సత్యముతోను దేవున్ని ఆరాధించాలి. మనల్ని రక్షించేది వాక్యమే కాబట్టి, వాక్యప్రకారము జీవించడానికి దివారాత్రము వాక్యమును ధ్యానించాలి. మీరు ఎప్పుడైతే వాక్యమును ధ్యానించడం మొదలుపెడతారో అప్పుడు దేవునితో మీకు సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. దేవుడు మీకు స్నేహితుడు అవుతాడు. **(సశేషం)**

# బైబిల్ ప్రాముఖ్యత

నిజమే కదా! ఈ వాక్యమును చదివి అర్థం చేసుకున్న వారు దాని ఔన్నత్యమును గ్రహించి ఆత్మీయ మేలులు పొందుతారు. కీర్తనాకారుడు 119 కీర్తన 103-105 వచనములలో వాక్యము ఆయన జిహ్వకు ఎంతో మధురంగా ఆయన నోటికి తేనెకంటే తీపిగాను పాదములకు దీపము త్రోవకు వెలుగుగానున్నట్లు వ్రాస్తున్నాడు. అదే వాక్యం తనను బ్రతికించునని (25వ) తనను స్థిరపరచునని (28వ) తన అడుగులను స్థిరపరచునని (133వ దుష్టమార్గములన్నిటిలో నుండి తొలగించునని వ్రాస్తున్నాడు. ఇంకా చెప్పాలంటే ధర్మశాస్త్రము హృదయంలో ఉన్నట్లయితే తమ అడుగులు జారవని (37:31) వాక్యమునుబట్టి యౌవనులు తమ నడతను శుద్ధి చేసు కొనగలరని (119:9), వాక్యము హృదయంలోనున్నట్లయితే ఆయన యెదుట పాపము చేయమని (119:9) కీర్తనాకారుడు బోధించుచున్నాడు. అవును ఈ వాక్యములో జీవమున్నది. అది మనుష్యులకు వెలుగైయున్నది. అయితే క్రైస్తవేతరులే కాదు క్రైస్తవులు కూడా వాక్యమును అన్యమైనదిగా భావించి కేవలం సంఘకాపరులకు, వారి ప్రసంగాలకు ఉపయోగపడే ఒక టెక్స్ట్ బుక్ అని అనుకుంటారు. ఈ వాక్యం ఇహలోకంలో ఉన్న మనకు బుద్ధి కలుగుటకు ఆత్మావేశము వలన వ్రాయబడిన ఈ మాటలను అన్యములుగా భావించుట ఎంతో దుఃఖకరమైన విషయం. హోషేయ (8:12) ప్రవక్త ద్వారా పలికిన ఈ మాటలు ఈ దినములలో కూడా యధార్థములే "నేను అతని కొరకు నా ధర్మశాస్త్రమును పరిపూర్ణంగా వ్రాయించి నియ మించినను వాటిని అతడు అన్యములుగా ఎంచెను".



ఈ వాక్యమును ఎడతెగక ధ్యానించవలెననుటకు కొన్ని కారణాలను తెలుసుకొందాం :

1. యోహాను 5:39 మూలభాషలో - లేఖనములయందు మీకు నిత్య జీవము కలదని తలంచుచు వాటిని "పరిశోధించుడి" అని వ్రాయబడి యున్నది. ఆయన ఆజ్ఞయై యున్నది లేఖనములను ధ్యానించుట ఆయన ఆజ్ఞకు లోబడుట.

2. ఇదే వాక్యములో లేఖనములయందు జీవమున్నదని ధ్యానించుట ద్వారా మనకు నిత్యజీవము కలుగునని స్పష్టమగుచున్నది.

3. వాక్యమును ధ్యానించడమనేది ఒక గొప్ప ధన్యత. కీర్తనలు 1:2,3 "యెహోవా ధర్మశాస్త్రమునందు ఆనందించుచు దివారాత్రములు దానిని ధ్యానించువాడు ధన్యుడు". వాక్యము ధ్యానించుట వలన ఫలవంతమైన జీవితము, ఇతరులకు ఆశీర్వాదకర మైన జీవితం కలుగును. "అతడు నీటి కాలువల యోరను నాటబడినదై ఆకు వాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలె నుండును. అతడు చేయున దంతయు సఫలమగును".

4. ప్రకటన 1:3 "సమయము సమీపించి యున్నది గనుక ఈ ప్రవచన వాక్యములు చదువువాడును, వాటిని విని యిందులో వ్రాయబడిన సంగతులను గైకొనువారును ధన్యులు". దేవునిచే ధన్యులు అని పిలువబడుదుము. ఆయన మన జీవితములను ఆశీర్వాదకరముగా చేయును.

5. మన ప్రార్థనలకు జవాబు ఇవ్వబడుతుంది. యోహాను 15:7 "మీయందు నా మాటలు నిలిచి యున్నట్లయితే మీకేది యిష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహించ బడును".

6. వాక్య ధ్యానము పాపమునకు దూరముగా ఉంచును. కీర్తన 119:11 "నీ యెదుట నేను పాపము చేయకుండు నట్లు నా హృదయములో నీ వాక్యమును ఉంచుకొని యున్నాను".

7. వాక్యధ్యానము అధిక జ్ఞానము పుట్టించును. కీర్తనలు 119:98-100 "నా శత్రువులను మించిన జ్ఞానము అవి నాకు కలుగచేయుచున్నవి... నా బోధకులందరి కంటే నాకు విశేష జ్ఞానము గలదు".

8. వాక్యము తెలివిలేని వారికి తెలివి కలిగించును. కీర్తనలు 119:130 "నీ వాక్యము వెల్లడి అగుటతోడనే వెలుగు కలుగును. అది తెలివిలేని వారికి తెలివి కలిగించును".

9. 2తిమోతి 3:16,17 "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవా వేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది".

10. హెబ్రీ 4:12 "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మను కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది".

11. ప్రభువు యొక్క మహాశక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండుటకు, అపవాది అనగా సాతాను తంత్రములను ఎదిరించుటకు, ప్రధానులతోను, అధికారుల తోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతో పోరాడుటకు, ఎదిరించుటకు, శక్తిమంతులమగునట్లు ఆయన ఇచ్చు సర్వాంగ కవచములో దేవుని వాక్యము రెండంచులు గల ఆత్మఖడ్గము (ఎఫెసీ 6:10-17). ఈ వాక్య ధ్యానము ఆత్మీయ పోరాటంలో ఎంతగానో ఉపయోగ పడుతుంది. అపవాదికి యేసయ్యకు జరిగిన ఆత్మీయ పోరాటంలో (మత్తయి 4:1-11, లూకా 4:1-13) అపవాది వాక్యమును ఉపయోగించగా యేసయ్య కూడా వాక్యఖడ్గము ద్వారానే ఎదిరించి తరిమి వేయగలిగాడు. అపవాదిని ఎదిరించుడి అప్పుడు వాడు మీ యొద్ద నుండి పారిపోవును (యాకోబు 4:1-7). ఎఫెసీ.5:25-27 "క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి అది కళంకమైనను, ముడుత యైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమగల సంఘముగాను ఆయన తన యెదుట దానిని నిలువబెట్టుకొనవలెనని, వాక్యముతో ఉదక స్నానము చేత దానిని పవిత్రపరచి, పరిశుద్ధపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను". వాక్య పఠనము, ధ్యానము మనలను శుద్ధిచేయును, పవిత్రపరచును. పుష్టికరమైన ఆత్మీయ ఆహారము వాక్యధ్యానములో వస్తుంది. **(సశేషం)**

**(22వ పేజీ తరువాయి...)**

స్కూల్ తరుపున రోబొటిక్స్ కాంపిటిషన్‌లో పార్టిసిపేట్ చేసి వస్తున్న ఆర్యన్ స్నేహితులు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందనే వార్త తెలిసి ఆర్యన్, అతని కుటుంబం షాక్ అయ్యారు. ప్రమాదంలో ఎవరికి ప్రాణాపాయం లేదని, చిన్నచిన్న గాయాలతో బ్రతికి బయటపడ్డారని వార్త తెలుసు కొని కాస్త ఊపిరి పీల్చుకున్నారు. ఆ క్షణం తాతయ్య చెప్పిన అంతా మన మేలుకే అనే విషయం కాస్త అర్థమయ్యింది ఆర్యన్‌కి. వెంటనే తన గదిలోనికి వెళ్ళి మోకరించి తనను కాంపిటీషన్‌కి పంపనందుకు థ్యాంక్స్‌తో పాటు, ఆ రోజు కోపంలో తాను దేవుణ్ణి ప్రశ్నించినందుకు మనః స్ఫూర్తిగా క్షమాపణలు వేడుకున్నాడు ఆర్యన్.

ఆ తర్వాత కొన్ని రోజులకు, స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఒక టెక్నికల్ ఫెస్ట్‌ను స్కూల్ యాజమాన్యం నిర్వహించారు. దానికి న్యాయనిర్ణేతలుగా పెద్ద టెక్ కంపెనీ వారు స్కూల్‌కు రావడం జరిగింది. ఆ ఫెస్ట్‌లో ఆర్యన్ తన పాత రోబోటిక్స్ ప్రాజెక్ట్ గురించి కాకుండా, లాప్‌టాప్ పాడై నప్పుడు తను నేర్చుకున్న కొత్త షార్ట్‌కట్ కోడింగ్ గురించి, పాత టెక్నాలజి పరిమితులను చాలా సులువుగా అధిగమిం చుటకు తను తయారు చేసిన అల్గారిథమ్‌ను వివరించాడు. న్యాయనిర్ణేతలుగా వచ్చినవారు ఆశ్చర్యపోయి, "మేము వెతుకుతున్నది ఇలాంటి సింపుల్ అండ్ పవర్‌ఫుల్ కోడింగ్ కోసమే!" అని ఆర్యన్‌ను విజేతగా ప్రకటించడమే కాక తమ కంపెనీ తరుపున ఒక ప్రత్యేక స్కాలర్‌షిప్‌ను ప్రకటించారు.

ఆర్యన్ లాప్‌టాప్ పాడవ్వడం వల్ల అతను ఆ ట్రిప్‌కు వెళ్ళలేదు. ఒకవేళ వెళ్ళి ఉంటే, తను కూడా ప్రమాదంలో పడేవాడు. అంతేకాక సరికొత్త గుర్తింపు వచ్చింది. కాబట్టి మనం అనుకున్నది జరగనప్పుడు నిరాశ చెందకూడదు. దేవుడు మనకు ఒక తలుపు మూసివేస్తే, అంతకంటే మెరుగైన మరొక మార్గాన్ని సిద్ధం చేస్తాడని నమ్మాలి.

***"ఒకడు తాను చేయబోవునది హృదయములో యోచించుకొనును యెహోవా వాని నడతను స్థిరపరచును" (సామెతలు 16:9)***

# మదర్ తెరీసా

1958 ఆగష్టు 22 మదర్ తెరీసా 'నిర్మల్ హృదయ్' ప్రారంభించారు. ప్రభువుకు కృతజ్ఞతలు చెల్లించి చనిపోవ టానికి సిద్ధంగా వున్న వాళ్ళకు ఆశ్రయం కల్పించుట మొదలుపెట్టింది. హిందూ దేవాలయం ప్రక్కనే అవసాన దశలో వున్న వాళ్ళు అక్కడకు చనిపోవడంకోసం వెళ్ళటం జనానికి నచ్చలేదు. తనువు చాలించిన వాళ్ళకు క్రిస్టియన్ పద్ధతిలో అంతిమ సంస్కారాలు జరుగుతున్నాయని, క్రిస్టియ న్లని ఖననం చేస్తున్నారని వదంతులు వ్యాపించాయి. డాక్టర్ అహ్మద్, మరో పోలీసాఫీసరు స్వయంగా పరిస్థితి ఏమిటో చూద్దామని వెళ్ళారు. నిర్మల్ హృదయ్‌లోకి అడుగు పెడు తూనే మదర్ తెరీసా కనిపించారు. మదర్ తెరీసా ఒక మనిషి యొక్క పుండును శుభ్రం చేస్తున్నారు. ఆ పుండు ఎంత దుర్వాసన కొడుతుందంటే ఆ గదిలో అడుగు పెట్టాలంటే భరించలేని దుర్వాసన. ఆ మనిషి పుండు శుభ్రం చేసి ఆ రోగితో అంటున్న మాటలు వాళ్ళకి వినిపిస్తున్నాయి. 'నీ మతం ఏమిటో మరి. ఆ మత ప్రార్థనలే చేసుకో. నాకు తెలిసిన ప్రార్ధన నేను చేస్తాను. యిద్దరం కలిసి ఈ ప్రార్ధన చేద్దాం. దేవునికి ప్రీతి పాత్రం అవుతుంది' అంటున్నారు మదర్ తెరీసా. మదర్ ఆఫీసర్లను చూసి, తాము చేస్తున్న పని ఏమిటో వాళ్ళకు చూపించబోయారు. పోలీసాఫీసరు కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి. అవసరంలేదు మదర్ అన్నాడు. బయట జనం గుంపుగా వున్నారు. వాళ్ళకేసి తిరిగి 'సరే మీ తల్లులు,చెల్లెల్లు ఈ పని చెయ్యడానికి ఒప్పిస్తే మదర్‌ని యిక్కడ నుండి నేను పంపేస్తాను. అంత పని చేయడం మన వల్ల కాదు. ఆమె ఒక సెయింట్ గనుక చేస్తుంది' అన్నారు. ఆఫీసర్లు ఇలా జోక్యం చేసుకున్నా కూడా, కాళీమాత గుడిపూజార్లు ఆమెను అక్కడ నుండి పంపించాలని ప్రయత్నిస్తూనే వున్నారు. కాళీమాత దేవా లయం పరిసరాల్ని ఒక క్రైస్తవ మత మిషనరీకి ధారాదత్తం చేయడం బ్రాహ్మణ పురోహితులకు తల తిరిగి పోయినట్లు వుంది. ఈ ఏర్పాటును తప్పించాలని చాలాసార్లు మున్సిపాలి టీకి అర్జీలు పెట్టారు. అంతలో ఒకరోజున ఒక వింత సంఘటన జరిగింది. ఒక యువ పురోహితుడు రక్తం కక్కు కున్నాడు. నిండా ముప్పయ్యేళ్ళైనా వుండవు. అతనికి క్షయ. బాగా ముదిరిన దశలో ఉంది. అలా ముదిరిపోయిన కేసుల్ని ఏ ఆసుపత్రిలోను చేర్చుకోరు. శారీరకంగా, మాన సికంగా జబ్బుపడ్డ ఆ పురోహితుడ్ని ఆఖరుకు నిర్మల్ హృదయ్‌కి తీసుకువచ్చారు. మదర్ తెరీసా అతనికోసం ప్రత్యేక స్థలం కేటాయించి చికిత్స మొదలుపెట్టారు. అతనికి కోపం, అవ మానం రెండూ కలిగాయి. కాని రోజులు గడిచే కొద్దీ ఆ పరిస్థితికి సర్దుకుపోయాడు. మదర్ తెరీసా చూపుతున్న ప్రేమని ఆ పురోహితుడు చవిచూశాడు. కొంతకాలానికే మనశ్శాంతితో చనిపోయాడు. మదర్ తెరీసా ఆ దేహాన్ని పంపించారు. ఆ దేవాలయ పురోహితులు తమ తోటి మనిషి పట్ల నిర్మల్ హృదయ్ చూపించిన శ్రద్ధ ఏమిటో గుర్తించారు. వాళ్ళు ఆ పని చేయలేకపోయారు. చేయడానికి ఇష్టపడనూ లేదు. కలకత్తాలో, సమీద ప్రాంతాల్లో అనేక రకాల మత, సాంఘీక సంస్థలు వున్నాయి. పేదలకి, రోగులకి చేయూత నిస్తుంటాయి. కానీ, ఏ ఒక్కటీ అవసానదశలో వున్న వాళ్ళనీ, ఇళ్లు లేని వాళ్ళను, హాస్పటల్స్ చేర్చుకోని వారిని చేర దీయవు. మదర్ తెరీసా, ఆమె సిస్టర్లు కరుణతో, జాలితో ఈ శిధిల శరీరాలను దిక్కూ మొక్కూలేని జీవాల్ని స్పృశిం చాలనే ముఖ్య విశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. నిర్మల్ హృదయ్‌లో స్ట్రెచర్ మీద వున్న ప్రతి జీవి జబ్బుపడి, అనాథ అయి చనిపోతూ వున్న క్రీస్తే అనే గాఢవిశ్వాసంతో వున్నందు వలన ఆ పని మనస్ఫూర్తిగా చేయగలుగుతున్నారు. మత మార్పిడి చేయడం, మృతదేహాల్ని క్రైస్తవ ఖననాలకి పంపడం కాదు. అలా కావాలని ప్రత్యేకంగా అర్థిస్తే తప్ప అలా

జరుగదు. వాళ్ళ అభిష్టానికి వ్యతిరేకంగా చెయ్యటం మదర్ తెరీసా దృష్టిలో మహాపాపం.

మదర్ తెరీసా, ఆమె సిస్టర్లు కలకత్తాలో ఒక గుడి బయట అడుక్కునే భిక్షకులు, స్థానికంగా రిక్షాలు లాక్కునే వాళ్ళు, వీళ్ళకు క్షయ ప్రబలంగా వుంటుంది. నిర్మల్ హృదయ్‌లో చేరాక వాళ్ళకు వైద్యసహాయంతో పాటు ప్రేమ పంచబడుతుంది. అదీ ముక్కూమొఖం ఎరుగని వాళ్ళ దగ్గర నుండి. అంతిమ సంస్కారం మృతుని కోరిక మీదే జరగాలని మదర్ జాగ్రత్త తీసుకునేవారు. రోగుల్ని అపస్మారక స్థితిలో అక్కడికి తీసుకువస్తే ఏ మతమో చెప్పలేదు గనుక వాళ్ళ దేహాలపై గుర్తులనుబట్టి సుంతీ వుంటే ముస్లీం అనీ, పచ్చ బొట్టు వుంటే హిందువులని, ఏ గుర్తులు లేకుంటే హిందూ సంప్రదాయం ప్రకారం కర్మకాండలు జరిపించేవారు. ముఖ్యంగా సిస్టర్లు నగరంలో వున్న ఇతర పేదల్లాగానే పేదలు. సిస్టర్లకి మరింత మెరుగైన భోజనం, శుభ్రమైన బట్టలు వుండ వచ్చుగాని స్వయంగా వరించుకున్న పేదరికం వల్ల, గుమ్మంలో నుంచి వాళ్ళతో ఒకటైపోతారు. మరణించే వారికి ఆదరణ కలిగించి, వాళ్ళు దేవుణ్ణి చూడబోతున్నారని చేప్పే వారు. ప్రతి మనిషి పుట్టుకా దేవునిలో నుంచే, ప్రతి మానవుని లోను దేవుడుంటాడు. మదర్ తెరీసాకు జీసస్ దేవుడు, ఒక హిందువుకు శివుడు, ముస్లీంకు అల్లా. మరణిస్తూ వున్న ఆ మనిషి చేతిని పట్టుకుని తను చేసిన పాపాల్ని క్షమించాలని తమ దేవుని వేడుకోమని చెబుతారు. చనిపోవడానికి ఇక్కడకంటే మంచి చోటు లేదు అని చాలామంది అన్నారంటే ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఒకరోజు రోడ్డు ప్రక్క కాలువలో పడివున్న ఒకతన్ని మదర్ తెరీసా కాపాడి నిర్మల్ హృదయ్‌కి తీసుకొచ్చారు. అతని ఒళ్ళంతా పుళ్ళతో వుంది. అతన్ని శుభ్రంచేసి, స్నానం చేయించి, పుళ్ళ మందులు వేశారు. అంతసేపూ అతను ఏమీ మాట్లాడలేదు, ముఖంలో భయమూ కనిపించలేదు. అతను మదర్ తెరీసా వైపు చూసి ఓ చిరునవ్వు నవ్వి, నేను బతుకంతా వీధుల్లో పశువులాగానే బతికాను. యిప్పుడు దేవతలా చనిపోతున్నాను అన్నాడు. తీసుకొచ్చిన మూడు గంటల్లోనే అతను చనిపోయాడు. ఆ సంఘటన మదర్ తెరీసాకు ఎంతో తృప్తినిచ్చింది.

ఒకసారి మదర్ తెరీసా ఒక ఆడమనిషిని చెత్తకుండీలో చూశారు. జ్వరంతో మూలుగుతుంది. మదర్ తెరీసా ఆమెను కాళీఘాట్ దగ్గర నిర్మల్ హృదయ్‌కి చేర్చి, నీళ్ళతో శుభ్రంచేసి, మందులు వేశారు. ఎందుకలా చెత్తకుండీలో పడివున్నావని మదర్ ఆమెను అడిగారు. కన్న కొడుకే ఆమెను అక్కడ పడేసి వెళ్ళిపోయాడని, తను తన గుండెను పిండేసే విషయం ఆమె జ్వరమూ కాదు, చనిపోతూ వుండటము కాదు. తన కన్న కొడుకే దిక్కులేకుండా చెత్తకుండీలో పారేశాడనే బాధ ఎక్కువని చెప్పింది. మదర్ తెరీసా ఆమె కొడుకును క్షమించమని అడిగారు. చాలా బతిమాలగా ఆమె తన కొడుకును క్షమించింది. మదర్ తెరీసా చేతుల్లో ప్రశాంతంగా తనువు చాలించింది. ఆమె ఆఖరుగా మదర్ తెరీసాతో కృతజ్ఞురాల్ని అని చిరునవ్వు నవ్వింది. అంత చక్కని చిరు నవ్వు కానుకగా ఎన్నడూ అందుకోలేదని మదర్ తెరీసా తృప్తిపడింది. ఇలా ఎందరో చనిపోతూ ప్రశాంతంగా దేవుని సన్నిధికి చేరుతున్నారు. కొందరు బాగుపడి వెళ్ళిపోతున్నారు.

పేదవాళ్ళ ఔదార్యం గురించి మదర్ తెరీసా నిర్మల్ హృదయ్‌లో తెలుసుకున్నారు. పడకలన్నీ నిండుగా వుండి, క్రొత్తగా తీసుకొచ్చిన వారికి కాస్త కోలుకున్న వాళ్ళు వారి పడకను ఇచ్చి వారి ఔదార్యాన్ని చూపించేవారు. ఎంత బాధలో కూడా ఎవరినీ నిందించకుండా, వారికి దొరికిన భాగ్యానికి మదర్‌కు కృతజ్ఞతలు చెల్లించేవారు. ఆ విధంగా ప్రభువు మహిమపరచబడినట్లు మనము చూడగలము. మదర్ తెరీసా దయగల హస్తం వారిని తాకితే మరణ తలుపు దగ్గర వున్న వారికి ఉపశమనం కలిగేది. దేవుడు మీ బాధను చూస్తున్నాడు. మిమ్మల్ని ప్రేమిస్తున్నాడు భయపడవద్దు అని వారికి ఆదరణ మాటలు చెప్పేవారు. భగవంతుని కలుసుకునే ముందు వారికి సమాధానము కలుగజేయబడి, వాళ్ళంతా నిత్యజీవములోకి వెళతారని అక్కడ పరిచర్య చూడటానికి వచ్చే వాళ్ళు అనుకునేవారు.

**(సశేషం)**

# తల్లిదండ్రులారా!

మీ వృద్ధాప్యంలో మీ బిడ్డల సంరక్షణలో మీరు సంతోషంగా, సమాధానంగా ఉండాలంటే ఇప్పుడు వారిని దేవునియందు భయభక్తులతో పెంచితేనే అది సాధ్యమవు తుంది. మీరు ఎంతసేపటికి పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ వారు కష్టపడ కూడదని ఎన్నో సమకూరుస్తుం టారు కదా, మరి మీ భవిష్యత్తు సంగతి ఏంటి? మీరు ఎల్లకాలం నవయవ్వనుల్లాగా ఉంటారా? వయసు పెరిగేకొద్ది పనులు చేసుకో లేక బిడ్డల మీద ఆధారపడే పరిస్థితి వస్తుంది కదా! మరి మీ బిడ్డలు మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుం టారన్న నమ్మకం మీకు ఉందా? మీ బిడ్డలు వయసుకు రాగానే పెళ్ళి చేస్తారు, వారికి ఒక కుటుంబం ఏర్పడుతుంది. వాళ్ళ కష్టాలు బాధలు వారికుంటాయి. ఈ లోకానుసారంగా పెరిగిన పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకుండా దూషిస్తూ కష్టపెట్టేచాలామందిని చూస్తుంటాం. వారిని చూసినప్పుడైనా మా బిడ్డలను అలా పెంచకూడదు అనుకోరు. ఎందుకంటే, పిల్లల మీద అపారమైన నమ్మకం ఉంటుంది. నా బిడ్డలు అలా చెయ్యరులే అనుకుంటారు. కానీ, చిన్నప్పుడు మీ బిడ్డలకు మీ మీద ఉండే ప్రేమ, వాళ్ళు పెరిగి పెద్దయ్యి, వారికి ఒక కుటుంబం ఏర్పడిన తర్వాత ఉండదు. ఏదో బాధ్యతగా, సమాజానికి భయపడి చూసుకుంటారే తప్ప హృదయ పూర్వకంగా ప్రేమించలేరు. దేవుని మీదనే తిరగ బడేవారు, తల్లి దండ్రులకు లోబడి ఉంటారా? *“ఆకాశమా, ఆలకించుము; భూమీ, చెవియొగ్గుము. నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని వారు నామీద తిరుగబడియున్నారు” (యెషయా 1:2)* అని దేవుడు తన ఆవేదనంతా ఆకాశానికి, భూమికి చెప్పుకొనేలా చేసే మనస్తత్వం ఉన్న మనుష్యులు తల్లిదండ్రులను మాత్రం నెత్తిన పెట్టుకొని చూసు కుంటారా? ఏశావు తన తల్లిదండ్రులైన ఇస్సాకు, రిబ్కాలకు మనోవేదన కలిగించినట్లు బైబిల్లో చూడగలం. వయసులో ఉన్నప్పుడు మీరు ఎంత కష్టాన్నయినా భరించగలరు కానీ, వృద్ధాప్యంలో ఉండి, ఒకవేళ మంచానికే పరిమితం అవ్వాల్సిన పరిస్థితిలో మీ బిడ్డలు మిమ్మల్ని పట్టించుకోకపోతే అది ఒక నరకంలా ఉంటుంది. ‘మేము పిల్లలను పెంచి గొప్పవారిని చేశాము, అయినా వారు మా మీద తిరుగబడ్డారు’ అని మీ బాధ ఎవరితో చెప్పుకుంటారు? మీలో మీరు కుమిలిపోవాల్సిందేగా. మీకు అలాంటి పరిస్థితి రాదని గ్యారంటీగా చెప్ప గలరా? ఒకవేళ అలాంటి పరిస్థితి మీకు ఎదురైతే అది మీ పెంపకాన్నిబట్టే కదా! మీ బిడ్డల ఆధ్యాత్మిక స్థితిపట్ల మీరు శ్రద్ధ వహించక పోవడంవల్ల అది మీకు శాపంగా మారు తుంది. **‘మీ పిల్లలకు నేర్పండి, మీ పిల్లలకు నేర్పండి’** అని దేవుడు ఎంత చెప్పినా మీరు వినకపోతే ఆ ఫలితం మీరు వృద్ధాప్యంలో అనుభవించాల్సి వస్తుంది. మీ బిడ్డలను మీరు దేవునియందు భయభక్తులతో పెంచినట్లయితే మీ వృద్ధాప్యంలో అది మీకు ఆశీర్వాదంగా మారి, సంతోష సమాధానాలతో చివరిశ్వాస వరకు జీవిస్తారు. ఈ లోకనుసారంగా పెంచితే అది మీకు శాపమై మీ వృద్ధాప్యమంతా మీకు నరకంలా అనిపిస్తుంది. *“వారికిని వారి సంతానమునకును నిత్యమును క్షేమము కలుగునట్లు **వారు నాయందు భయభక్తులు కలిగి** నా ఆజ్ఞలన్నిటిని అనుసరించు **మనస్సు** వారికుండిన **మేలు**” (ద్వితీయో. 5:29).* మీకు, మీ బిడ్డలకు నిత్యము క్షేమము కలగాలంటే మీరు దేవునిలో ఉంటూ, మీ బిడ్డలను దేవునియందలి భయభక్తులతో పెంచాలన్న మనస్సు మీకు ఉండాలి. **మీ బిడ్డల విషయంలో ఇది దేవుని చిత్తమైయున్నది.**

ఏ కుటుంబంలో అయితే సాతాను రాజ్యమేలుతుందో, ఆ కుటుంబంలో అశాంతి, అసమాధానం ఉంటాయి. అందువల్ల తల్లిదండ్రులు బిడ్డల ఆధ్యాత్మిక స్థితిని పట్టించు కోరు. దేవుడు ఆదాము, హవ్వలను సృజించిన తర్వాత *“మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి” (ఆది. 1:28)* అని వారిని

ఆశీర్వదించాడు. ఆదాము, హవ్వలతో కుటుంబ వ్యవస్థ ఏర్పడింది. వారు ఫలించి, అభివృద్ధి పొంది, వారి బిడ్డలతో భూమిని నింపించాలని దేవుడు కోరుకున్నాడు. అయితే ఆదాము, హవ్వలతో దేవుడు ఏర్పాటు చేసిన కుటుంబ వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని, కుటుంబాలను విచ్ఛిన్నం చేయాలన్నదే సాతాను ప్రణాళిక. అందుకే భార్యాభర్తల మధ్య చిచ్చుపెట్టి వారు విడిపోయేలా చేయడం ద్వారా పిల్లలు భ్రష్టుపట్టి దేవునికి పనికిరాకుండా చేయాలన్న సాతాను సంకల్పం ప్రతి కుటుంబంలో నెరవేరుతుంది. భార్యాభర్తలు ఇద్దరూ ఒకరి మీద ఒకరు ఆధిపత్యం కోరుకోవడం వలన మధ్యలో పిల్లలు నలిగిపోతుంటారు. భార్యాభర్తలు ఇద్దరూ సంపాదిస్తుంటే మాత్రం ఎవరూ తగ్గే ప్రసక్తే ఉండదు. ఇలాంటి ధోరణి వలన పిల్లలు సంతోషంగా ఉండలేరు. సాతాను కోరిక నెరవేరుస్తూ బిడ్డల ఆధ్యాత్మికస్థితిని గాలికి వదిలేసే తల్లిదండ్రులు దేవుని శిక్షకు గురికాక తప్పదు. క్రైస్తవ కుటుంబంలో పుట్టి పెరిగి, చిన్నప్పటి నుండి దేవుని వాక్యము వింటున్నప్పటికీ, తగ్గింపు స్వభావం లేనివారు క్రైస్తవులు ఎలా అవుతారు? కన్నబిడ్డల విషయంలోనైనా ఎవరో ఒకరు తగ్గించుకోకపోవడం అంటే వారి గర్వము తారాస్థాయికి చేరినట్టే. మీకు మీ **'అహం'** ఎక్కువో, మీ బిడ్డలు ఎక్కువో మీరే ఆలోచించుకోవాలి. బిడ్డలు నాశనమైనా పర్వాలేదు మేము తగ్గే ప్రసక్తే లేదు అనుకుంటే మాత్రం ఆ కుటుంబంలో సాతాను తిష్టవేసుకొని కూర్చుంటుంది. తల్లిదండ్రులకు బిడ్డలను దూరం చేసి చెడు వ్యసనాలకు బానిసలు చేసి వారి జీవితాన్ని నాశనం చేసే వరకు సాతాను వదిలిపెట్టదు. కుటుంబానికి దూరమైన పిల్లలు నేరస్తులుగా మారిపోతుంటారు. వారిలో వారికే తెలియని **'కసి'** పెరిగి పోయి సైకోలుగా తయారవుతుంటారు. అందుకే సైకాలజిస్టు దగ్గరకు ఎవరినైనా తీసుకెళ్తే ముందుగా కుటుంబ పరిస్థితి అడిగి తెలుసుకుంటారు. అప్పుడు కుటుంబ పరిస్థితుల ప్రభావం వారి మీద ఎంతవరకు పని చేస్తున్నాయో ఒక అంచనాకి వస్తారు. పిల్లల స్థాయి నుండి అప్పుడే యవ్వనం లోకి అడుగుపెడుతున్నవారు చెడు అలవాట్లకు బానిసలై నేరస్తులుగా మారడానికి వారి తల్లి దండ్రుల ప్రవర్తన వలన కుటుంబంలో ఏర్పడే పరిస్థితుల ప్రభావమే. వారి ప్రవర్తన ప్రభావం బిడ్డలను నాశనం చేస్తుందని గ్రహించని తల్లి దండ్రులు, బిడ్డలు నాశనమైన తరువాత పశ్చాత్తాపపడతారు. కాబట్టి క్రైస్తవ తల్లిదండ్రులారా, సాతాను మీ బిడ్డలను టార్గెట్ చేసి వారి జీవితాలను నాశనం చేయకముందే, మీ బిడ్డల విషయమై మీరు భారము కలిగి, వారు మానసికంగా కృంగి పోకముందే మీ ప్రవర్తనను సరిచేసుకోండి. మీ బిడ్డలు సాతాను బారి నుండి రక్షింపబడాలంటే, దేవునియందు భయ భక్తులతో పెంచండి. కుటుంబంలో **'దేవుడు'** అన్న భావన కలిగేలా మీ ఇంటి వాతావరణాన్ని మార్చండి. మీ మధ్య ఎన్ని గొడవలు, మనఃస్పర్ధలు ఉన్నా సరే, మీ బిడ్డల భవిష్యత్ కోసం వాటిని పక్కన పెట్టండి. అప్పుడే మీరు మీ బిడ్డలను నిజంగా ప్రేమిస్తున్నట్లు. **మీ బిడ్డలకోసం మీరు తగ్గించుకొని జీవించడం దేవుని చిత్తమైయున్నది.** **(సశేషం)**


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లో పీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# బహుమానము

ప్రభువైన యేసు నామమున మీకందరికి శుభములు. ప్రతి మానవుని హృదయంలో పుట్టుకతోనే ఎన్నో ఆశలు, కోరికలు కలిగి ఉంటాయి. వాటి అన్నిటిని నేరవేర్చుకొనుటకు లోకంలో ఎన్నో పనులు, చేస్తాడు, ఉద్యోగం, వ్యాపారమంటు క్షణం తీరిక లేకుండా పరుగెడుతూ తన కోరిక నెరవేర్చమని దేవున్ని ప్రార్థిస్తూ ఉంటాడు. ఆ కోరిక నువ్వే వద్దు అనుకుంటే సరే కాని, దేవుడే తృణీకరిస్తే నీ మనస్సు తట్టుకోలేదు. ఆదరించేవారు లేక ఎవరికీ చెప్పు కోలేక మనస్సులోనే తల్లడిల్లి పోతున్నావా? బాధపడకు ఓ సహోదరా, ఓ సహోదరి నీ ప్రేమ అందరికీ నిస్వార్థంగా పంచావు. కాని నిన్ను ప్రేమించేవారు ఒక్కరైనా లేరని అనుకుంటున్నావా? నీ త్యాగం దేవుడు మరచిపోడు. ఆయనే నీ ఆదరణకర్త. ఆయన మీద ఆశ పెట్టుకో. ఆయన ఎప్పుడూ నిన్ను విడువడు, ఎడబాయడు, మరువడు. నీ తోడుగా వుంటాడు. ఎందుకో చెప్పనా? ప్రభువైన యేసుక్రీస్తే నీ గొప్ప బహుమానము. భయపడకుము, నేను నీకు కేడెము, నీ బహుమానము అత్యధికమగునని చెప్పెను. (ఆది. 15:1).

నీవు మేలు చేసి కీడు అనుభవిస్తున్నావా? నీవు చూపిన ప్రేమకు ప్రతిఫలముగా నిందలు అవమానాలు పొందుతున్నావా? నీ త్యాగాన్ని ఎవరు గుర్తించలేదా? దిగులుపడకు నీ కొరకు ఆయన మరల రాబోతున్నాడు. నీవు చేసిన ప్రతి పనికి లెక్క ఉన్నది. దానికి తగిన జీతమును ఆయన వెంట బెట్టుకొని తీసుకొస్తున్నాడు. "ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వానివాని క్రియ చొప్పున ప్రతివాని కిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది' (ప్రకటన 22:12). నీకు బహుమానము ఆయన యొద్ద ఉన్నది. మరచుటకు ఆయన మానవుడు కాడు. అన్యాయస్థుడు అసలే కాదు. తన నామమునుబట్టి చూపిన ప్రేమను మరచుటకు, దేవుడు అన్యాయస్థుడు కాడు" (హెబ్రీ. 6:10). నీ బహుమానము ఎలా పొందుకుంటావో తెలుసా? 1) దేవుని నిమిత్తము, సువార్త నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డమాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు, సంతోషించి ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును." (మత్తయి 5:11, 12). 2) దేవుని నిమిత్తము నీవు ఏదైనా వదలివేస్తే ఆయన ఏమి చేస్తాడో తెలుసా? "నా నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెంద్రనైనను తలిదంద్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు ఇప్పుడు ఇహమందు హింసలతో పాటు నూరంతలుగా ఇండ్లను, అన్నదమ్ములను అక్క చెల్లెంద్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోక మందు నిత్యజీవమును పొందునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" (మార్కు 10:29,30), 3) "ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్లు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొన డని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను." (మత్తయి 10:42). ఇతరులకిచ్చుట ద్వారా దేవుని యొద్ద నుండి తప్పక ఫలము పొందుతావు. అయితే రహస్యముగా చేయాలి ఇది మరువకు. "నీవైతే ధర్మము చేయునప్పుడు నీ ధర్మము రహస్యముగా నుండు నిమిత్తము నీ కుడిచెయ్యి చేయునది నీ యెడమ చేతికి తెలియక యుండవలెను. అట్లయితే రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును. 4) నీ ప్రార్థనా జీవితానికి ప్రతిఫలము ఉంది. నీవు ప్రార్థన చేయునప్పుడు, నీ గదిలోనికి వెళ్లి తలుపు వేసి రహస్యమందున్న నీ తండ్రికి ప్రార్థన చేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును" (మత్తయి 6:6). దేవుడు నీ రహస్య ప్రార్థనా సహవాసమును ఘనపరచును. 5) "నీవు విందు చేయునప్పుడు బీదలను అంగహీనులను కుంటివాండ్రను గ్రుడ్డివారిని పిలువుము. నీకు ప్రత్యుపకారమం చేయుటకు వారికేమియు లేదు గనుక నీవు ధన్యుడవగుదువు. నీతిమంతుల పునరుత్థానమందు నీవు ప్రత్యుపకారము పొందుదువని చెప్పెను." (లూకా 14:13-14). నీవు చేసిన ఉపకారమునకు, మేలునకు ప్రతిగా ప్రత్యుపకారము చేస్తారని వారికేదీ చేయకు. ఇదిగో మీ ఫలము పరలోకమందు గొప్పదై యుండును అని యేసు చెప్పెను. నీ జీవితంలో కూడా నీ ఫలము యేసు నుండి పొందుకో. ఆమేన్.

–ఇట్లు, **డా॥ సుష్మ ప్రశాంత్, నెల్లూరు**

# నా కుటుంబము



**భార్య, భర్త, పిల్లలు కలిసి ఒకే చోట ఉంటే దానిని కుటుంబము అంటారు. పిల్లలు ఉన్నా లేకపోయినా భార్యా భర్తలు కలిసి జీవిస్తున్నా కుటుంబమనే అంటారు. కుటుంబ వ్యవస్థ అనేది దేవుని ప్రణాళికలో భాగమే. కుటుంబ వ్యవస్థలో స్త్రీ ప్రధాన భూమిక పోషిస్తుంది.**

---

దేవుడు మానవాళికి ఇచ్చిన బహుమానం కుటుంబం. తన కుటుంబంలో తనకు లభ్యం కానిది ప్రపంచంలో మరెక్కడా లభ్యం కాదు. ఎందుకంటే పాతనిబంధన కాలంలో దేవుని దీవెన అయినా, దేవుని ఉగ్రత అయినా వ్యక్తిగతంగా కాక కుటుంబ పరంగానే నెరవేర్చ బడినవి. విమోచింపబడిన ఇశ్రాయేలీయుల జనాంగము ఐగుప్తు నుండి బయలుదేరి నప్పుడు అనేకులైన అన్యజనుల సమూహము కూడా వారిని వెంబడించింది. వారి మధ్యనున్న మిశ్రిత జనం మాంసాపేక్ష అధికంగా కనపరచి జనాంగంలో తెగులుకు కారణమైనారు.

కనుక దేవుడు ఏర్పరచిన ఒక కుటుంబములోని వారు తమ కుటుంబమునకు చెందని వారిని (వారు క్రైస్తవులైనను) కుటుంబీకులుగా చేర్చకూడదు. దావీదు సొంత అన్నయైన షిమ్యా కుమారుడైన యెహోనాదాబు వలననే అమ్నోనుకు మరణము వచ్చింది. సొలొమోను కుమారుడైన రెహబాము తన తండ్రి తర్వాత రాజైన తర్వాత తన తండ్రియైన సొలొమోను బ్రతికియున్నప్పుడు అతని సముఖమందు సేవ చేసిన పెద్దలను సన్మానించక వారి మాటలను గౌరవించ నందు వలన తన రాజ్యము చీలిపోవడానికి కారణమైనాడు. తల్లిదండ్రులను సన్మానించడమంటే వారి మాటలను, సలహాలను గౌరవించటమే! సన్మానించుట ఆశీర్వాదకరము. అలా చేయకపోతే శాపము అవుతుంది.

ప్రతి సంవత్సరము మే నెలలో కుటుంబ దినమును ప్రపంచమంతా వేడుక చేసుకుంటుంది. ఉపాధ్యాయ దినము, తండ్రుల దినము, తల్లుల దినము, అదే విధమైన ప్రాముఖ్యత కుటుంబమునకు ఇవ్వబడుతుంది.

ఎన్నికలు జరిగేటప్పుడు రకరకాల సంస్థలు పార్టీల బలాబలాల విషయం సర్వే చేస్తుంటాయి. అయితే మనం నివశించే ప్రాంతంలో కాని, మన ఊరిలో కాని నివశించే కుటుంబాలు ఎక్కువకాలం సంతోషంగా ఉండే కుటుంబాలు లేక సంతోషకరమైన కుటుంబాలు, నెమ్మదిగా జీవించే కుటుంబాలు, విఫలమైన కుటుంబాలు, దుఃఖ పూరితమైన కుటుంబాలు సర్వే చేస్తే ఏ రకమైన కుటుంబాల సంఖ్య ఎక్కువ వస్తుంది?

సరే, అవన్నీ ప్రక్కన పెడితే నేను నివసించే నా కుటుంబం సంతోషకరమైనదా? కాదా? అని ఆలోచిస్తే అసలు సంతోషం లేకపోవడానికి సంతోషం కలిగి ఉండ టానికి మూలం ఎవరు? అని కుటుంబంలోని ప్రతి ఒక్కరూ ఆలోచించుకోవలసిన అవసరం ఉంది.


నా వరకు వస్తే కుటుంబ యజమానిగా నేనున్నంత కాలము నాకు భయపడి కాని, గౌరవించికాని నా కుటుంబం నెమ్మదిగా ఉంటుంది. నేను మరణించిన తర్వాత అన్ని విషయాల్లో అందరూ స్వతంత్రంగా ఆలోచిస్తారు, పంచు కుంటారు, తగువు లాడుకుంటారు. ఇది లోక సహజం.

మా పేటలో పాతిక సంవత్సరాలు గతించిన తర్వాత ఒకప్పుడు వైభవంగా వెలిగిన ఇళ్ళు ఇప్పుడు స్మశాన వాటికవలె పాడు పడినవి. ఎందుకు? ఇంటి యజమాని పోయిన తర్వాత మిగిలినవారు త్యాగపూరిత మనసు, దేవుని మనసు లేనివారైనారు. నాకు తెలిసిన ఒక దైవజనుడు గతించిన తర్వాత ఆయన ఆస్తిని కుమారులందరూ ఏ పేచీ లేకుండా పంచు కున్నారు. ఆ విధంగా ఆ దైవజనుడు తన బిడ్డలను తన కుటుంబమును మలుచుకున్నాడు.

**(సశేషం)**

## ఈ నెల ప్రశ్న - ఏప్రిల్-2026

**యూదా రాజైన హిజ్కియా యొక్క తల్లి పేరు ఏమిటి? (2రాజులు)**




మీ జవాబు (రెఫరెన్సుతో సహా) ఈ నెల 15వ తేదీలోపు 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా మాత్రమే పంపించాలి. సరైన సమాధానం పంపిన వారిలో **'లక్కీడిప్'** ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి రూ.250/-లు విలువ చేసే **'అపొస్తలుడు'** అనే పుస్తకం బహుమతిగా ఇవ్వబడుతుంది. అయితే ఈ అవకాశం కేవలం **'చందాదారులకు మాత్రమే'**. అనగా చందా చెల్లించిన వారు (చందాదారుల పట్టికలో పేరు ఉన్నవారు) ఈ ప్రశ్నకు జవాబు పంపించాలి. 15వ తేది లోపు చందా చెల్లించేవారు కూడా పాల్గొనవచ్చును. ఈ క్రింది బాక్సులో జవాబు, మీ పేరు, బుక్ సీరియల్ నంబరు వేసి ఫోటో తీసి వాట్సాప్ ద్వారా పంపించాలి. పేరు, సీరియల్ నంబరు లేకపోతే వారి పేరు లక్కిడిప్‌లో చేర్చబడదు.

జవాబు.........................................................

పేరు...........................................................

గ్రామము................బుక్ సీరియల్ నంబరు...........

**మార్చి-2026 ప్రశ్న జవాబు :**

**అజూబా (1రాజులు 22:42)**

(జవాబు మరియు రెఫరెన్సు తప్పని సరిగా వ్రాయాలి)

**జవాబులు పంపినవారు :**

1. టి. క్రిస్టియానమ్మ- నందికొట్కూరు
2. వై.సంధ్యారాణి-ఒంగోలు
3. బి. నెహెమ్యా-చిన్నగంజాం
4. స్వయంప్రభ-చిలకలూరిపేట

### చందాదారుల వివరములు

| | | |
|---|---|---|
| **పి.వి.కెరోలిన్, గుంటూరు** | **(12-12-25)** | **10000** |
| ఈ.సి.సుగుణమ్మ, పులివెందుల | (26-12-25) | 5000 |
| యు. అనిత, సిరివెళ్ళ | (09-12-25) | 5000 |
| డా॥ బి. ప్రజ్వలిత్ రూబేన్, హన్మకొండ | (12-10-24) | 5000 |
| రెవ.డా॥ వి. విజయకుమార్, బొబ్బిలి | (15-01-24) | 5000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (21-06-24) | 5000 |
| మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా | (29-11-22) | 5000 |
| డా॥ క్రిస్టియన్ సిరప్ప, అనంతపూర్ | (23-01-26) | 3000 |
| బి. ప్రభువరకుమార్, రామన్నపేట | (24-06-25) | 3000 |
| కె. రజిని, నరసరావుపేట | (15-06-25) | 3000 |
| బి. రవికుమార్, హైదరాబాద్ | (26-11-25) | 2000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (22-08-25) | 2000 |
| పి. జయదేవి, గుంటూరు | (03-07-25) | 2000 |
| వై. సంధ్యారాణి, ఒంగోలు | (04-01-25) | 2000 |
| డా॥ సిహెచ్‌కె. సుష్మప్రశాంత్, నెల్లూరు | (22-01-24) | 1500 |
| కొడవటికంటి అశోక్‌కుమార్, ఒంగోలు | (09-08-25) | 1000 |
| రావెల ప్రసాదరావు, గుంతకల్లు | (27-03-25) | 1000 |
| జి. కమలాకర్, ఒంగోలు | (03-03-25) | 1000 |
| శ్రీమతి రూతు హోసన్న, కావలి | (09-11-24) | 1000 |
| జి.మాణిక్యమ్మ, అనంతపురం | (25-03-24) | 1000 |
| డి. ప్రభావతి, కొడవకల్లు, కృష్ణాజిల్లా | (12-12-25) | 800 |
| బి. నెహెమ్యా, చిన్నగంజాం | (07-01-26) | 500 |
| పి. దేవదానం, గుంటూరు | (17-10-25) | 500 |
| యం. విల్సన్ సామ్యేల్, నెల్లూరు | (08-09-25) | 500 |
| డి. శ్యామ్‌సిన్హా, బాపట్ల | (04-09-25) | 500 |
| ఆర్. జయమ్మలాబాను, గుంతకల్లు | (16-07-25) | 500 |
| జి. జార్జిథామస్, దుగ్గిరాల | (12-03-25) | 500 |
| కె. ప్రకాశరావు, నరసరావుపేట | (14-01-25) | 500 |
| బి. సరోజిని, గుంతకల్లు | (06-05-25) | 400 |
| టి. జోయల్‌రాజు, భీమిలి | (11-03-26) | 350 |
| కె. స్వప్నిక, మార్కాపురం | (20-02-26) | 350 |
| జి. హనోక్, తూర్పుగంగవరం | (12-02-26) | 350 |
| జి. మేరిక్యాథరిన్, ఒంగోలు | (11-02-26) | 350 |
| డి. శామ్యుల్ డేవిడ్, దేవరపల్లి | (04-02-26) | 350 |
| డి. నాగేశ్వరరావు, సంతరావూరు | (31-01-26) | 350 |
| కె. ప్రభాకర్, వెంకటగిరి | (06-01-26) | 350 |
| సిహెచ్. దయరాజు, రామానుజపురం | (05-11-25) | 350 |
| కె. మార్టిన్‌మధుచరణ్, పులివెందుల | (18-10-25) | 350 |
| టి. క్రిస్టియానమ్మ, నందికొట్కూరు | (08-09-25) | 350 |
| పి. స్వప్న, పాల్వంచ | (09-08-25) | 350 |
| మారనాత బైబిల్ సెమినరీ, విజయవాడ | (06-08-25) | 350 |
| జి. ఏంజల్ పౌలాస్- ఒంగోలు | (02-08-25) | 350 |
| జి. రవి, వేల్పూరు | (12-07-25) | 350 |
| స్వయంప్రభ, చిలకలూరిపేట | (14-06-25) | 350 |
| యస్. రాజశేఖర్, కర్నూలు | (04-06-25) | 350 |
| జి. దేవదాసు, నంద్యాల | (05-04-25) | 350 |
| జి. కళావతి జాకబ్, ఒంగోలు | (03-04-25) | 350 |

**చిన్నపిల్లల పేజి**

# అంతా నా మేలుకే

వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో ఇల్లంతా బంధువులతో నిండిపోయింది. అందరి నవ్వులతో మాటలతో హాల్ అంతా నిండిపోయింది. ఇంటి బయట లాన్‌లో పిల్లలందరూ ఆడుకుంటున్నారు. కానీ ఆర్యన్ మాత్రం తన రూమ్‌లో కంప్యూటర్‌తో కుస్తీలు పడుతున్నాడు. తల్లి వచ్చి పిలిచినా బయటకు రాలేదు. ఎనిమిదవ తరగతి చదువుతున్న ఆర్యన్ ఒక టాలెంటెడ్ స్కూల్ స్టూడెంట్. అతనికి కోడింగ్ అంటే ప్రాణం. ఒక అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీ కోసం ఆరు నెలలు కష్టపడి ఒక అద్భుతమైన ప్రాజెక్ట్ సిద్ధం చేశాడు. ఆర్యన్ గురించి తెలిసిన తల్లిదండ్రులు బంధువులు అతనిని ప్రోత్సహిం చేవారు.

సెలవులు ముగియడంతో బంధువుల తిరుగు ప్రయాణానికి సిద్ధపడుతున్నారని వెళ్ళేముందు పలకరిస్తే బావుంటుందని తల్లి చెప్పిన సలహా మేరకు, తన ల్యాప్‌టాప్ తీసుకొని హాల్లోకి వచ్చాడు ఆర్యన్. తన పని చేసుకుంటూనే ప్రక్కనే కూర్చుని కాఫీ తాగుతున్న బంధువుల ప్రశ్నలకు జవాబిస్తున్నాడు. ఇంతలో పరుగెత్తుకుంటూ వస్తున్న చింటూ అనే బంధువుల అబ్బాయి బ్యాలెన్స్ తప్పి క్రిందపడ్డాడు. వాడి చేతిలోని కూల్‌డ్రింక్ పెట్ బాటిల్, ఆర్యన్ ప్రక్కన కూర్చున ఆర్యన్ ఆంటీ కాఫీ కప్పుకు తగిలింది. ఫలితంగా కాఫీ, కోక్ ఆర్యన్ లాప్‌టాప్ మీద పడ్డాయి. ఆర్యన్‌కి ప్రాణం పోయినంత పనైంది. గబాగబా తుడిచి ల్యాప్‌టాప్ ఆన్ చేయడానికి ప్రయత్నించాడు. కానీ ల్యాప్‌టాప్ ఆన్ అవ్వలేదు. అంతే! నెలల తరబడి కష్టపడి రాసిన కోడింగ్, డిజైన్స్ అన్నీ ఉన్న లాప్‌టాప్ డెడ్ అయిపోయింది. ఆర్యన్ దగ్గర బ్యాకప్ కూడా లేదు.

ఆర్యన్‌కు కన్నీరు ఆగడంలేదు. అందరూ రకరకాలుగా ధైర్యం చెప్తున్నా, రాత్రికి రాత్రి రిపేర్ అవ్వదని, తన శ్రమ అంతా వృథా అయిపోయిందని, తాను కాంపిటీషన్‌లో పాల్గొనడం కుదరదని ఆర్యన్‌కి అర్థమైంది. ఏమి చేయలేక, ఎవరిని నిందించలేక ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాడు. జరిగిన నష్టానికి బాధపడుతూనే బంధువులు తిరుగు ప్రయాణమయ్యారు. అందరూ వెళ్ళిపోయాక ఆర్యన్ వాళ్ళ తాతయ్య ఆర్యన్ దగ్గరకు వెళ్ళి– చూడు ఆర్యన్, దేవుడు ఏది చేసినా అంతా మన మేలుకే చేస్తాడు. ఇందులో ఎవరి తప్పులేదు. చింటూ చిన్నపిల్లవాడు వానికేమి తెలియదు. నీ శ్రమ అంతా వృథా అయ్యిందని నీవు అనుకుంటున్నావు కానీ దేవుడు నీకు మేలు చేయడానికే అని ఈ పరిస్థితిని నీవు అంగీకరించాలి. నీకు కలిగే బాధ, కోపం ఇవన్నీ తాత్కాలికం కాబట్టి దేవుడు నీ జీవితంలో చేయబోయే మేలునుబట్టి సంతోషంగా ఉండు అని హితవు చెప్పాడు.

తాతయ్య చెప్పిన వేదాంతం పూర్తిగా అర్థం కాకపోయినా దేవుని మీద తనకున్న నమ్మకం కొద్ది కాస్త బాధ తగ్గింది. మరునాడు స్కూల్‌కి వెళ్తే అతని స్నేహితులు, “అయ్యో! నీ కష్టమంతా బూడిదలో పోసిన పన్నీరైంది కదా” అని బాధపడ్డారు. కానీ ఆర్యన్ ప్రశాంతంగా, “దేవుడికి తెలుసు ఏది జరగాలో. బహుశా నాకంటే మంచి ప్లాన్ ఆయన దగ్గర ఉందేమో. అంతా మన మేలుకే!” అన్నాడు.

ఆర్యన్ దృష్టి మళ్ళించడానికి తాతయ్య తన పాత కంప్యూటర్‌ను ఆర్యన్‌కు ఇచ్చి ఆపరేట్‌చేసి చూడమన్నాడు. అది పాత కంప్యూటర్ కావడం వలన వాడడం కొంత అసౌకర్యంగా ఉన్నప్పటికి, తాతయ్య చెప్పే షార్ట్‌కట్స్‌తో ఆ కంప్యూటర్‌ను వాడడం ఆర్యన్‌కు నచ్చింది. తాతయ్య సహాయంతో మళ్ళీ మొదటి నుండి కోడింగ్ నేర్చుకోవడం మొదలుపెట్టాడు. అన్నీ క్రొత్తగా నేర్చుకునే క్రమంలో ఆర్యన్ కాంపిటీషన్‌లో పాల్గొనలేకపోయాననే అనే విషయాన్నే పూర్తిగా మర్చిపోయాడు. అంతేకాక పాత టెక్నాలజీ పరిమితుల వల్ల, అతను చాలా తక్కువ మెమరీతో పనిచేసే ఒక కొత్త ‘లైట్ వెయిట్ అల్గారిథమ్’ కనిపెట్టాడు.

**(మిగతాది 14వ పేజిలో)**

## బైబిల్ పద వినోదము-15 జవాబులు

### ఇశ్రాయేలు రాజులు

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| య | గా | ప్ర | యె | యా | యె | హో | రా | ము | స | ప | గే | డి | భా | బ |
| రొ | ను | దీ | జె | లు | కొ | సి | రి | యా | సి | మో | హ | ము | యె | ర |
| బా | నా | చు | బె | యే | న్న | స | మ | పె | క | హు | జీ | షా | స్త | జ |
| ము | దా | హ్యా | లు | జా | జె | నా | రా | లా | ను | నా | బో | తు | స్కు | తు |
| యొ | బు | క | ద్ద | హు | క | ను | మా | య | న | కు | మ్రి | రం | మ | ప |
| తు | తి | పె | ఓ | శ్రాం | ర్యా | వి | కు | మీ | ను | ఒ | నే | డి | ద | రె |
| బా | ము | క | దే | ఓ | లు | గ | మ్రి | జే | య | తు | ఏ | ను | నే | సొ |
| నె | నే | ను | ధు | బ | డ | జి | కు | తి | షే | త్వి | లీ | జ్యా | సా | ను |
| దీ | ఘూ | న | బు | ద్యా | మ | కె | ర్నా | న | హో | లు | యా | స్సు | హ | గ |
| మీ | క | హో | ను | గ | ష | రీ | ను | కి | డ | డ | వా | యె | ల | అ |
| మీ | అ | ద | నా | కా | ల్లా | తు | జు | ద్రో | డి | దూ | ఎ | ష | త్తి | కొ |
| ఎ | ను | కొ | ర్బు | నే | ము | ద్ద | హో | ను | హూ | రు | యొ | యా | నా | ని |
| లీ | డి | షో | మ్రో | ను | అ | యి | యా | యె | ప్పు | గా | ము | హే | న | మె |
| షా | తి | శ్రాం | వి | కు | ల | ర్మీ | హో | ము | ణ | బం | ప్రా | మీ | ఏ | డు |
| దొ | షు | యా | హో | యె | ర | యా | యె | కు | దు | ద | న్హా | బె | ను | లా |

**జవాబులు పంపినవారు :**

1. కె. జయమ్మ–చీరాల, 2. కె. లత–చీరాల, 3. యం. స్వయంప్రభ– చిలకలూరిపేట, 4. యం.రాజు–ముగతి, 5. టి. క్రిస్టియానమ్మ–నందికొట్కూరు, 6. పి.విజయకుమారి –ఒంగోలు, 7. కె. యేసురత్నం–ఒంగోలు, 8. కె. శ్రీమాన్విక–బొమ్మూరు, 9. వి.వినోద్‌కుమార్– మండపం, 10.యన్.రాజేంద్రప్రసాద్–హైదరాబాద్, 11. కె. ప్రభాకర్ –వెంకటగిరి, 12. వై. సంధ్యారాణి–ఒంగోలు, 13.యు. మేరిసలోమిని–సిరివెళ్ళ, 14. బి. మోనిక ఏంజెలీనా –ఒంగోలు, 15. బి. నెహెమ్యా– చిన్నగంజాం, 16. పి. ప్రభుకుమార్–ఒంగోలు, 17. సి.హెచ్. దయరాజు– రామానుజపురం, 18. మేరిపవిత్ర–మంచిర్యాల, 19. కె. మార్టిన్ మధుచరణ్–పులివెందుల.


**సండేస్కూల్/V.B.S. బుక్స్ మరియు గేమ్స్ కొరకు**

**ఫోన్: 9440217726**





# బైబిల్ పద వినోదం - 16

## యూదా రాజులు

ఈ క్రింది పదాలను ప్రక్కనున్న అక్షరాలలో వెదకండి. పదాలు అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఉండవచ్చు, కానీ పదాలు ఒకదాని మీదగా ఇంకొకటి గుర్తించ కూడదు. గుర్తించిన క్రింది పదమును (✓) టిక్ పెట్టండి. మిగిలిన అక్షరాలను ఎడమ నుండి కుడికి, కుడి నుండి ఎడమకు సమకూర్చి వచ్చిన వాక్యమును క్రింద బాక్స్‌లో వ్రాయండి.

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| యె | నా | త | ల్లి | అ | హ | జ్యా | గ | బ | ర్భ | లు | యీ | గ | బీ | అ |
| హో | చి | ర్మిం | యా | యో | నా | తా | ను | ని | త్షె | న్ను | న | దు | మం | సౌ |
| షా | న | ము | రి | సి | ద్కి | యా | వా | డ | వు | బ | ను | అ | లు | నీ |
| పా | న | యా | ఊ | అ | వు | యె | హో | యా | కీ | ను | తా | బ్షా | నీ | వే |
| తు | న్ను | బీ | క | యా | జ | లు | గ | సె | జే | సి | నా | లో | లు | యా |
| చూ | ఇ | అ | ము | జ్జి | సౌ | ర్యా | దా | ధ | రూ | వి | న | ము | బా | జ్కి |
| ఆ | ష్బో | డ | కీ | ఉ | లొ | గా | వీ | భ | య | యా | అ | ము | నా | హి |
| మో | షె | ను | ము | షు | మో | ర్య | దు | శ్చ | ఆ | ను | మ | బు | వా | యో |
| ను | తు | ష్షే | యె | నా | ను | ఓ | బే | దె | దో | ము | జ్యా | కు | పు | ట్టు |
| ట్టి | బ | న | హో | యా | ను | ఆ | హా | జు | దు | అం | ము | వి | న్న | చు |
| షు | నే | మ | యా | షీ | ను | ష | అ | నీ | యి | కు | రె | తా | కృ | జు |
| తు | వా | స్తు | కీ | యె | తా | మ్మా | బీ | జ్ఞ | ష్ణ | లు | హ | త | యో | హో |
| తా | లు | యో | ము | చె | ద్యా | ల్లిం | షై | చు | యె | కా | బా | చు | న్నా | యా |
| మా | ర్య | శ్చ | ఆ | దీ | లు | ము | ర్య | కా | నీ | మీ | ము | సా | ను | హో |
| రు | క | ర | య | ము | లు | యె | హో | రా | ము | గొ | ల్యా | తు | ఆ | యె |

పేరు...............................గ్రామము...............................

అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు...............................

**'బైబిలు పద వినోదము-16'** పూర్తి చేసిన తర్వాత పేరు, ఊరు, అడ్రస్ లేబుల్ మీద ఉన్న బుక్ సీరియల్ నంబరు వ్రాసి ఈ పేజీని ఫోటో తీసి 9440217726 నంబరుకి వాట్సాప్ ద్వారా పంపగలరు లేదా ఈ పేజీని జెరాక్స్ తీసి **15వ తేదీలోగా** మా అడ్రసుకు పంపగలరు. సీరియల్ నంబరు వేయకపోతే వారి పేరు ప్రచురింపబడదు.

| | | | | | |
|---|---|---|---|---|---|
| సౌలు | కీషు | ఆసా | షమ్మా | దావీదు | యెష్షయి |
| యోవాబు | అబీషై | సెరూయా | తామారు | యదీద్యా | యోవాషు |
| అమజ్యా | అహజ్యా | అజర్యా | యోతాము | ఉజ్జియా | ఆహాజు |
| హిజ్కియా | మనష్షే | ఆమోను | యెషీయా | సిద్కియా | నాబాలు |
| బత్షెబ | నాతాను | గొల్యాతు | మీకాలు | ఊరియా | ఇష్బోషెతు |
| అబ్షాలోము | యోనాతాను | సొలొమోను | రెహబాము | అబీయాము | యెహోరాము |
| యెహోషాపాతు | యెహోయాకీను | యెహోయాకీము | యెహోయాహాజు | ఓబేదెదోము | అబీగయీలు |

**పై పదాలను గుర్తించిన తర్వాత మిగిలిన అక్షరాలను సమకూర్చి, వచ్చిన వాక్యమును ఇక్కడ వ్రాయండి.**

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _

(కీర్త. 139:13,14)

_ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _ _